Published from Eluru RNI NO:APTEL/25/A1219

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com

ప్రజాభూమి **కావలెను** ప్రజాభూమి

లోకల్ RNI కలిగి ప్రతిరోజు ప్రింటింగ్ అవుతున్న ప్రజాభూమి దినపత్రికకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఏలూరు,భీమవరం జిల్లాల బ్యూరో ఇంఛార్జ్ లు , ఉంగుటూరు, పోలవరం, దెందులూరు,చింతలపూడి, కైకలూరు, నూజివీడు,ఆచంట,ఉండి, తణుకు, నర్సాపురం, తాడేపల్లి గూడెం, పాలకొల్లు, నియోజకవర్గాలకు నియోజకవర్గ ప్రతినిధులు కావలెను. ఆసక్తి గల అభ్యర్థులు సంప్రదించండి.

చీఫ్ ఎడిటర్ 95021 16677

ఏలూరు ELURU

| సంపుటి:01 | సంచిక:191 | ఆదివారం | జులై 20, 2025 | ఎడిటర్:రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి | పేజీలు :8 | వెల: 3 రూ |
|---|---|---|---|---|---|---|
| Vol.No.01 | Issue No.191 | Sunday | 20 July 2025 | Editor: Ankireddypalle Ramamohan Reddy | Pages 8 | Rs 3\- |

published from Vijayawada,Kakinada, Ananthapuramu, Kadapa, Eluru Circulated at AndhraPradesh & Telangana

# స్వచ్ఛాంధ్రతోనే స్వర్ణాంధ్ర సాధ్యం





**ప్లాస్టిక్ భూతాన్ని తరిమేద్దాం**
**ఎక్కువ ప్లాస్టిక్ వాడితే క్యాన్సర్ బారినపడే ప్రమాదం**
**రాష్ట్రంలో పేరుకుపోయిన చెత్తను అక్టోబర్‌లోపు తొలగిస్తాం**
**నేర రాజకీయాలు చేసేవాళ్లు ప్రజలకు అవసరమా.?**

**ఇంట్లో చెత్తను ఊడ్చినట్లుగానే నేరస్తులనూ ఊడ్చేయండి**
**-తిరుపతిలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు**
**రేణిగుంటలో ఇంటిగ్రేటెడ్ వేస్ట్ ప్రాసెసింగ్ కేంద్రం పరిశీలన**

ప్రజాభూమిప్రతినిధి,తిరుపతి :-

పర్యావరణాన్ని కాపాడుకోవాలంటే ప్లాస్టిక్ భూతాన్ని తరిమేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ ఎక్కువగా ఉపయోగిస్తే ప్రజలు క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉందని అన్నారు. మిగతా 2లో..





**తిరుపతిలో కపిలేశ్వరస్వామిని దర్శించుకుని ఆలయ పరిసరాలను సిబ్బందితో కలిసి శుభ్రం చేసిన సీఎం**



## తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మక కార్యక్రమం.. సుపరిపాలనలో తొలి అడుగు డోర్ టు డోర్

- మంత్రి నారా లోకేష్ పర్యవేక్షణలో ప్రతి ఇంటిని టచ్ చేసేలా సాంకేతికత మేళవించి కార్యక్రమం
- కూటమి ప్రభుత్వ ఏడాది పాలన విజయాలను ప్రజలకు వివరిస్తూ గ్రామ గ్రామాన సాగుతున్న కార్యక్రమం
- ఏడాది పాలనపై ప్రజల యొక్క అభిప్రాయాలు, విలువైన సలహాలు తీసుకుంటున్న నాయకులు
- గత 18 రోజుల్లో 50 లక్షలకు పైగా ఇళ్లు కు టీడీపీ శ్రేణులు
- ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలపై ప్రజల నుంచి ఆత్మీయ స్పందన
- కార్యక్రమ నిర్వహణ తీరుపై ఎప్పటి కప్పుడు డ్యాష్ బోర్డ్ ద్వారా నివేదికలు
- గ్రౌండ్ లోకి వెళ్లే నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేసేలా SMSలు, IVRSలు

ప్రజాభూమిప్రతినిధి,అమరావతి:

విధ్వంస పాలనకు చరమగీతం పాడి సుపరిపాలన వైపు అడుగుపెట్టి విజయవంతంగా ఏడాది పూర్తి చేసుకుంది తెలుగుదేశం ప్రభుత్వం. గత ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగా సూపర్ 6 పథకాల్ని ప్రజలకు అందిస్తోంది. ఓవైపు సంక్షేమాన్ని అందిస్తూనే మరోవైపు నవ్యాంధ్రప్రదేశ్ ను స్వర్ణాంధ్రప్రదేశ్ గా మార్చేందుకు విజన్ 2047తో దూసుకుపోతోంది తెలుగుదేశం ప్రభుత్వం. తెలుగుదేశం పార్టీ అధికారం చేపట్టి ఏడాది పూర్తి చేసుకున్న ఈ శుభ తరుణంలో ఏడాది ప్రజాపాలన గురించి, అందుకున్న విజయాల గురించి ప్రజలకు వివరిస్తూనే..పాలనపై ప్రజలు ఏమనుకుంటున్నారు, ప్రభుత్వం అందిస్తున్న మిగతా 2లో..

## మోడీ రాజ్యాంగాన్ని హత్య చేశారు : ఖర్గే

న్యూఢిల్లీ : శనివారం మైసూర్‌లోని మహారాజా కళాశాల మైదానంలో 'సాధన సమావేశం' జరిగింది. మైసూరుకు రూ. 2,500 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం కోసం కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం సాధన సమావేశ నిర్వహించింది. ఈ సమావేశానికి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్య మంత్రి డి.కె శివకుమార్ తో పాటు పలువురు మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ.. 'కాంగ్రెస్ పార్టీలో ప్రజలు ప్రదర్శిస్తారు.



మోడీ బిజెపిలో ప్రజలు మాట్లాడతారు' అని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ రాజ్యాంగాన్ని హత్య చేశారని ఖర్గే ఆరోపించారు. అయితే భారత ప్రజలు బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు రాజ్యాంగాన్ని మార్చడానికి అనుమతించరు అని ఆయన నొక్కి చెప్పారు.రాజ్యాంగాన్ని సవరించడం లేదా, తిరిగి రాయడం గురించి బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు పదేపదే మాట్లాడుతున్నాయి. మీరు ఎంత ప్రయత్నించినా, ఈ దేశ ప్రజలు రాజ్యాంగాన్ని మార్చడానికి మిమ్మల్ని అనుమతించరు. ఒకవేళ మీరు (ప్రజలు) రాజ్యాంగాన్ని మార్చడానికి వారిని అనుమతిస్తే మీకు ఎటువంటి హక్కులు ఉండవు అని ఖర్గే ప్రజలను హెచ్చరించారు. మిస్టర్ మోడీ మీరు రాజ్యాంగం కారణంగానే ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి అయ్యారు. పార్లమెంటులోకి ప్రవేశించే ముందు మీరు రాజ్యాంగానికి నమస్కరించారు. కానీ ఇప్పుడే అదే మోడీ రాజ్యాంగాన్ని హత్య చేస్తున్నారు. ప్రతిరోజూ, బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు ఈ రాజ్యాంగాన్ని తొలగించడానికి ప్రయత్నాలు చేస్తున్నాయి అని ఖర్గే అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ ప్రపంచంలో 42 దేశాలను సందర్శించారు. కానీ.. సంఘర్షణలతో అట్టుడుకుతున్న మణిపూర్‌ను మాత్రం ఇప్పటివరకు ఆయన సందర్శించలేదు అని ఆయన విమర్శించారు.

## ఇజ్రాయిల్ దాడులకు 50 మంది మృతి

గాజా : శనివారం గాజావ్యాప్తంగా జరిపిన ఇజ్రాయిల్ దాడుల్లో 50 మంది పాలస్తీనియన్లు మృతి చెందారు. వీరిలో రఫాలో ఆహారం కోసం నిల్చున్నవారిలో 30 మంది మృతి చెందినట్లు మీడియా వర్గాలు తెలిపాయి. ఇదిలా ఉండగా కాల్పుల విరమణ ప్రతిపాదనకు హమాస్ ప్రతిపాదించగా.. ఇజ్రాయిల్ తిరస్కరించింది. కాగా, ఇప్పటివరకు ఇజ్రాయిల్ దాడుల్లో.. 58, 667 మంది మృతి చెందారు. 139,979 మంది గాయాలపాలయ్యారు. ఇంకా అనధికారంగా చాలా మందే చనిపోయారని మీడియా పేర్కొంది.



## ఒడిశాలో ఇంటర్ బాలికకు నిప్పంటించిన ముగ్గురు

భువనేశ్వర్ : ఒడిశాలో నేరాలు పెరిగిపోతున్నాయి. ఇటీవల ప్రొఫెసర్ లైంగిక వేధింపులు తట్టుకోలేక ఓ విద్యార్థిని నిప్పంటించుకుని ఆత్మాహుతికి పాల్పడింది. ఈ ఘటన మరువకముందే ఆ రాష్ట్రంలో మరో దారుణం చోటుచేసుకుంది. ఇంటర్ చదివే బాలికకు ముగ్గురు నిప్పంటించారు. తీవ్ర గాయాల పాలైన ఆ బాలికను ఒడిశా ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆ బాలిక పరిస్థితి విషమంగా ఉందని పోలీసు అధికారులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. ఒడిశాలోని పూరీ జిల్లాలో బయాబర్ గ్రామంలో జరిగింది. మిగతా 2లో..



## 2027 నాటికి మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్: అమిత్ షా



రుద్రపూర్:2027 నాటికి భారతదేశం ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడుతూ శరవేగంగా ముందుకు సాగుతోందని ఆయన అన్నారు. ఉత్తరాఖండ్‌లోని రుద్రపూర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో అమిత్ షా ప్రసంగిస్తూ, 2014లో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దేశంలో అభివృద్ధి వేగవంతమైందని తెలిపారు. గడిచిన పదేళ్లలో దేశాభివృద్ధి 60 శాతం వృద్ధిని నమోదు చేసిందని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా 45 వేల కిలోమీటర్ల మేర రైల్వే లైన్లు, రోడ్లు నిర్మించినట్లు అమిత్ షా వెల్లడించారు. వాజ్ పేయి హయాంలో భారతదేశం 11వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని, మోదీ పాలనలో నాలుగో స్థానానికి చేరుకుందని, త్వరలోనే మూడో స్థానానికి ఎదుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. 2047 నాటికి దేశాన్ని అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలబెట్టేందుకు మోదీ సంకల్పించారని ఆయన పునరుద్ఘాటించారు. ప్రస్తుతం ఆర్థిక ర్యాంకింగ్స్‌లో అమెరికా, చైనా, జర్మనీ మాత్రమే భారత్ కంటే ముందున్నాయని ఆయన గుర్తు చేశారు. ఇదే విధంగా మనం ముందుకు సాగితే మరో మూడేళ్లలో జర్మనీని అధిగమిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. దీని కోసం మూలధన వ్యయాల పెంపు, సులభతర వాణిజ్య నిర్వహణ, దేశంలో పెట్టుబడులు పెట్టడానికి ప్రపంచ కంపెనీలను ఆహ్వానించడం వంటి చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు.



# రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదు

**రోజాపై టీడీపీ ఎమ్మెల్యే వ్యాఖ్యలు... తీవ్రస్థాయిలో స్పందించిన జగన్**

ప్రజాభూమిప్రతినిధి,తాడేపల్లి:-

వైసీపీ నేత, మాజీ మంత్రి రోజాపై నగరి టీడీపీ ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ అనుచిత వ్యాఖ్యలు చేసినట్టుగా ఆరోపణలు రావడం తెలిసిందే. గత కొన్నిరోజులుగా వైసీపీ నేతలు భానుప్రకాశ్ పై నిప్పులు చెరుగుతున్నారు. తాజాగా, వైసీపీ అధినేత జగన్ తొలిసారిగా ఈ వ్యవహారంపై స్పందించారు. రోజాపై టీడీపీ ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ వ్యాఖ్యలను ఖండిస్తున్నట్టు తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియాలో భారీ ట్వీట్ చేశారు. "మాజీ మంత్రి రోజాపై టీడీపీ ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ చేసిన వ్యాఖ్యలు అత్యంత హేయం. తెలుగుదేశం పార్టీలో దారుణంగా మారిన దుష్ట సంస్కృతికి ఆ వ్యాఖ్యలు అద్దం పడుతున్నాయి. ప్రభుత్వ తప్పిదాలను ఎత్తి చూపుతూ గట్టిగా మాట్లాడుతున్నందుకు, వాటిని ప్రశ్నిస్తున్నందుకూ ఓర్చుకోలేక, రెండుసార్లు ఎమ్మెల్యే గానూ, మంత్రిగానూ పని చేసిన నా సోదరి రోజాను అత్యంత అసభ్యకరమైన పదజాలంతో దూషించారు. ఇది యాదృచ్ఛికంగా జరిగింది కాదు. తమను విమర్శించే మహిళల గొంతు నొక్కడమే ధ్యేయంగా తెలుగుదేశం పార్టీలో ఒక తంతుగా మారిన అత్యంత హేయమైన సంస్కృతికి ఇది ఒక నిదర్శనం. వ్యక్తిత్వ హననం ద్వారానే చంద్రబాబు తన రాజకీయ జీవితం కొనసాగిస్తున్నారు. నిజం చెప్పాలంటే ఒక మహిళపై అత్యంత హేయంగా ఆరోపణలు చేసి, దుష్ప్రచారం చేసి ఆయన ఉన్నత పదవి పొందారు. అప్పటి నుంచే వ్యక్తిగత దాడులు, స్త్రీలను ద్వేషించే తత్వం తెలుగుదేశం పార్టీకి ఒక బ్రాండ్‌గా మారింది. ధైర్యంగా మాట్లాడే మహిళలను భయపెట్టి వారి నోరు మూయించడానికి నిస్సిగ్గుగా అత్యంత అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేయడంతో పాటు, విమర్శించడాన్ని ఆ పార్టీ నాయకులు ఒక ఆనవాయతీగా పెట్టుకున్నారు. ఆ కోవలోనే గత ఏడాది కాలంగా అనేక మంది మహిళా నాయకురాళ్లను వారు దారుణంగా వేధించారు, అవమానించారు. తనపై ఒక ఎమ్మెల్యే చేసిన అత్యంత హేయమైన వ్యాఖ్యలపై ఫిర్యాదు చేయడానికి రోజా వెళ్లగా, వాస్తవాలు స్పష్టంగా కళ్లెదుటే కనిపిస్తున్నా పోలీసులు తిరిగి ఆమెపైనే సందేహాలు వ్యక్తం చేశారు. ఇది రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ ఎంత దారుణంగా మారింది? టీడీపీ గుండాలను రక్షించేందుకు వారు ఏ స్థాయిలో తమ బాధ్యత, కర్తవ్యాన్ని మర్చి వ్యవహరిస్తున్నారన్నది చూపుతున్నాయి. నిజానికి ఒక్క రోజా విషయంలోనే కాదు. మాజీ మంత్రి విడదల రజని, కృష్ణా జిల్లా జడ్పీ ఛైర్‌పర్సన్ ఉప్పాల హారికతో పాటు, మా పార్టీకి చెందిన పలువురు నాయకుల కుటుంబ సభ్యుల విషయంలో కూడా చాలా అవమానకర ఘటనలు చోటు చేసుకున్నాయి. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం వచ్చాక మహిళలకు ఏ మాత్రం రక్షణ లేకుండా పోయింది. ఇకనైనా మాజీ మంత్రి రోజాను దారుణంగా అవమానించిన ఎమ్మెల్యే భానుప్రకాశ్ ను తక్షణమే అరెస్టు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలి" అంటూ జగన్ డిమాండ్ చేశారు.

ప్రజాభూమి

## ఒడిశాలో ఇంటర్ బాలికకు నిప్పంటించిన ముగ్గురు

మొదటిపేజీ తరువాయి

ఈ గ్రామానికి చెందిన ఇంటర్ చదివే ఓ బాలిక తన స్నేహితురాలికి బుక్స్ ఇచ్చేందుకు శనివారం ఉదయం 8.30 గంటల సమయంలో తన ఇంటికె ళ్తుంది. స్నేహితురాలి ఇంటికి వెళ్తున్న ఆ అమ్మాయిని భార్గవి నది సమీపంలోని నిర్జన ప్రదేశంలో ముగ్గురు వ్యక్తులు ఆమెను అడ్డుకుని.. నిప్పంటించి పారిపోయారు. మంటల్లో కాలుతూ అరుస్తున్న బాలికను స్థానికులు చూసి.. వెంటనే మంటల్ని ఆర్పేందుకు ప్రయత్నించారు. తొలుత పిపిలీలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆ తర్వాత మెరుగైన చికిత్స కోసం ఒడిశాలోని ఎయిమ్స్‌కి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితులను అరెస్టు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు.మహిళా, శిశు అభివృద్ధి శాఖ బాధ్యతలు నిర్వహిస్తున్న ఒడిశా ఉప ముఖ్యమంత్రి ప్రవతి పరిదా ఈ ఘటనపై స్పందించారు. ఈ ఘటనపై ఆమె విచారం వ్యక్తం చేశారు. బాలిక చికిత్స ఖర్చులన్నీ ప్రభుత్వమే భరిస్తుందని ఆమె వెల్లడించారు. నిందితులను వెంటనే అరెస్టు చేసి.. కఠిన

# సంపాదకీయం

## సిబిల్ బాధలకు ఇక చెల్లు.. లోన్లు ఇక ఈజీ.. కేంద్రం సరికొత్త వ్యవస్థ?




ఆ మధ్య యువకుడి సిబిల్ స్కోరు తక్కువగా ఉందని పెళ్లి నిరాకరించింది అమ్మాయి తరఫు కుటుంబం. మొన్నటికి మొన్న సిబిల్ స్కోరు లేదని ఓ పెద్ద బ్యాంకు ఉద్యోగం నుంచి తీసేస్తే దానిని సమర్థించింది కోర్టు.. ఆరునెలల కిందట ఓ ప్రయివేటు కంపెనీ అయిన సిబిల్ మన క్రెడిట్ స్కోరును నియంత్రించడంపై ప్రభుత్వాన్ని సాక్షాత్తు పార్లమెంటులోనే నిలదీశారు ఓ ఎంపీ... అవును ఓ విధంగా ఆలోచిస్తే.. ఎవరీ సిబిల్..? మనపై దాని పెత్తనం ఏమిటి..? పదేళ్ల కిందటే దేశీయ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను తీసుకొచ్చిన మోదీ ప్రభుత్వం.. ఇప్పుడు అత్యంత ప్రధానమైన సిబిల్ పై ఏమీ చేయలేదా..? ఈ ప్రశ్నలకు సమాధానంగానే కేంద్రం చర్యలు తీసుకుంటోందని తెలుస్తోంది. ఇక సిబిల్ కు చెల్లు చెబుతూ కొత్త వ్యవస్థను ప్రవేశపెట్టనుందని సమాచారం. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు రుణాలు ఇవాలంటే, క్రెడిట్ కార్డులు మంజూరు చేయాలంటే చూసేది క్రెడిట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఇండియా లిమిటెడ్ (సిబిల్) స్కోరునే. ఈక్విఫాక్స్ వంటివి మరో మూడు నాలుగు ఇలాంటి సంస్థలే ఉన్నా సిబిల్ ను ఎక్కువ ప్రామాణికంగా తీసుకుంటున్నాయి. ఈ స్కోరు సరిగా లేకుంటే రుణాలు, కార్డులు నిరాకరిస్తున్నాయి. వాస్తవానికి కొందరికి ఆర్థిక వ్యవహారాల్లో జాగ్రత్త పడుతూ. . చెల్లింపులు సరిగా చేస్తున్నా సిబిల్ తక్కువగా ఉంటోందన్న ఆరోపణలున్నాయి. అందుకనే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు కేంద్రం ఆలోచనల్లో ఉన్న దాని ప్రకారం.. కేంద్ర ఆర్థిక శాఖ పరిధిలోని ఆర్థిక సేవల విభాగం... సిబిల్ వంటి సంప్రదాయ క్రెడిట్ స్కోర్లపై ఆధారపడడాన్ని నివారించనుంది. దీనిస్థానంలో కొత్తగా డిజిటల్ లెండింగ్ వ్యవస్థ.. యూనిఫైడ్ లెండింగ్ ఇంటర్ ఫేస్ (యూఎల్ఐ)ని విస్తరించనున్నట్లు చెబుతున్నారు. యూఎల్ఐతో మరింత క్రమబద్ధీకరించిన, సమగ్ర రుణ ప్రక్రియను రూపొందించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది కేంద్రం. ఈ మేరకు ఆర్థిక సేవల సంస్థ అన్ని ఆర్థిక సంస్థలను నెలవారీ ప్రాతిపదికన యూఎల్ఐ స్వీకరణను సమీక్షించాలని ఆదేశించింది. ఈ వ్యవస్థలో అందరూ తక్షణమే చేరాలని సూచించింది. ఇప్పటికే కేంద్ర ఆర్థిక శాఖ.. ఆర్బీఐ, కేంద్ర, రాష్ట్ర మంత్రిత్వ శాఖలతో సమావేశమై యూఎల్ఐ అమలు పైన చర్చించింది. రుణ మంజూరును వేగంగా, సమర్థంగా చేయడం, సిబిల్ పై తక్కువగా ఆధారపడడం తగ్గించడమే లక్ష్యంగా యూఎల్ఐని తీసుకురానున్నారు. టెక్నాలజీ, డేటా, పాలసీని ఒకదగ్గరకు చేర్చి రుణ ప్రక్రియను మరింత సులువు చేసే డిజిటల్ ప్లాట్ ఫామ్ యూఎల్ఐ. రుణదాతలు, ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, ఇతర విభాగాల నుంచి హైక్వాలిటీ, సర్టిఫైడ్ డేటాను యాక్సెస్ చేసేందుకు ఇది వీలు కల్పిస్తుంది. ఫాస్ట్, సమగ్ర క్రెడిట్ డెలివరీని సులభం చేస్తుంది. రుణ మంజూరు రెగ్యులరైజేషన్, క్రెడిట్ అంచనాలకు సమయాన్నితగ్గించడం సహా అనేక ప్రయోజనాలు యూఎల్ఐతో ముడిపడి ఉన్నాయి. మరీ ముఖ్యంగా సిబిల్ వంటి సంస్థల బాధలను తప్పిస్తూ ప్రభుత్వం చేతిలోనే పౌరుల క్రెడిట్ స్కోరు ఉంటుందని చెప్పొచ్చు.

# స్వచ్ఛాంధ్రతోనే స్వర్ణాంధ్ర సాధ్యం

మొదటిపేజీ తరువాయి

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుపతిలో పర్యటించారు. ముందుగా రేణిగుంట సమీపంలోని తూకివాకంలోని ఇంటిగ్రేటెడ్ వేస్ట్ ప్రాసెసింగ్ కేంద్రాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. ఆతర్వాత తిరుపతి బయలుదేరి వెళ్లి కపిలేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పారిశుధ్య సిబ్బందితో కలిసి పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం ప్రజావేదిక సభలో పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. స్వచ్ఛాంధ్ర లక్ష్య సాధనలో భాగమవ్వండియువత ఉత్సాహం చూస్తుంటే సంతోషంగా ఉంది. యువతే ఈ దేశానికి సంపద. ప్రపంచంలో ఎక్కడ చూసినా నూటికి 30 శాతం మంది మనవారే ఉన్నారు. పిల్లల్ని చూస్తుంటే నా కాలేజీ రోజులు గుర్తొస్తున్నాయి. నేను కూడా తిరుపతిలోనే చదువుకున్నాను. తర్వాత ఎమ్మెల్యే అయ్యాను. అంచెలంచెలుగా ఎదిగి 4వ సారి ముఖ్యమంత్రి అయ్యానంటే ఏడుకొండల స్వామి ఆశీస్సులే కారణం. స్వచ్ఛాంధ్ర లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యవ్వాలి. మన ఇల్లు, పరిసరాలు శుభ్రం చేసుకోవాలి. పల్లెలు, పట్టణాలు, చెరువులు, ప్రభుత్వ కార్యాలయాలు, పరిశ్రమలు, ఆస్పత్రులు, విద్యాలయాల్లో ప్రతి నెలా మూడో శనివారం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. పర్యావరణాన్ని మనం కాపాడుకుంటే ఆరోగ్యంగా ఉంటాము. చెట్లు విరివిగా నాటాలి. అవార్డులు పారిశుధ్య కార్మికుల కృషితోనే'జాతీయస్థాయిలో మన రాష్ట్రానికి ఐదు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు రావడం సంతోషాన్ని ఇస్తోంది. స్వచ్ఛ్ సూపర్ లీగ్ 2024-25కు తిరుపతి, గుంటూరు, విజయవాడకు గుర్తింపు దక్కింది. ఇందులో విజయవాడ దేశంలోనే 4వ స్థానంలో నిలవడం ఆనందంగా ఉంది. అలాగే గార్బేజ్ ఫ్రీ సిటీల్లో విజయవాడ 7వ స్థానంలో నిలిచింది. ఫైమిత్ర సురక్షిత్షెహర్ కేటగిరీలో విశాఖపట్నంకు మొదటి ర్యాంక్ వచ్చింది. ప్రామిసింగ్ స్వచ్ఛ షెహర్‌గా రాజమండ్రికి గుర్తింపు దక్కింది. ఈ అవార్డులు రావడానికి కారణమైన పారిశుధ్య కార్మికులు, మున్సిపల్ ఉద్యోగులు, అధికారులు, ప్రజలు అందరికీ నా అభినందనలు తెలియజేస్తున్నాను. మీరే నిజమైన సమాజ సేవకులు. ప్లాస్టిక్‌ను నిర్మూలించాలనే థీమ్‌తో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర నిర్వహిస్తున్నాం' అని ముఖ్యమంత్రి తెలిపారు. ప్లాస్టిక్ భూతానికి ఎవరూ బలికావద్దు'పర్యావరణానికి ప్లాస్టిక్ అతిపెద్ద భూతంగా తయారైంది. ఈ భూతానికి ఎవరూ బలికాకూడదు. ఉదయం పళ్లు తోముకునే బ్రష్ నుంచి ఆహారం తినే ప్లేట్ వరకు అన్నింటా ప్లాస్టిక్ ఉంది. రోజు వాడి పడేసే బాటిళ్లు, కప్పులు, కవర్లు ప్రమాదకరమైనవి. ఇవి నీటిని, నేలను కలుషితం చేస్తున్నాయి. క్యాన్సర్ రావడానికి ప్లాస్టిక్ కారణం. భూమిలో ప్లాస్టిక్ వ్యర్థాలు ఎక్కువై వర్షం నీరు భూమిలోకి ఇంకదు. మొక్కలు మొలకెత్తవు. నీటి మూలాలు మూసుకుపోతాయి. భూగర్భ జలాలు పడిపోతాయి. ప్లాస్టిక్ వినియోగం పెరిగే కొద్దీ పర్యావరణంపై ప్రతికూల ప్రభావం పడుతుంది. రోజూ తినే ఆహారం, నీటిలో మనకు తెలియకుండానే మైక్రో ప్లాస్టిక్స్ కలిసిపోతోంది' అని సీఎం వివరించారు. విషవాయులతో శ్వాస సంబంధిత వ్యాధులుప్లాస్టిక్ తయారీ సమయంలోనూ, వాటిని కాల్చినప్పుడు వెలువడే విష వాయువులు శ్వాస సంబంధిత వ్యాధులకు దారితీస్తున్నాయి. క్యాన్సర్ వంటి అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు నదులు, కాలువలు, చెరువులకు శాపంగా మారాయి. జలచరాల మనుగడకు ముప్పుగా మారుతోంది. 120 మైక్రాన్ కన్నా తక్కువున్న ప్లాస్టిక్ బాగ్స్, వాడి వదిలే కప్పులు, ప్లేట్ల వాడకాన్ని ప్రతి ఒక్కరూ మానేయాలి. ప్లాస్టిక్ బదులుగా గుడ్డ సంచులు, మెటల్ స్ట్రాలు, కంపోస్టబుల్ ప్లేట్లు వాడకాన్ని ప్రోత్సహించాలి' అని సీఎం పిలుపునిచ్చారు. ఆగస్టు15 నాటికి ప్లాస్టిక్ రహితంగా రాష్ట్ర సచివాలయం'ఆగస్టు 15 నాటికి రాష్ట్ర సచివాలయాన్ని ప్లాస్టిక్ రహితంగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. అక్టోబర్ 2 కల్లా అన్ని మున్సిపల్ కార్పొరేషన్లు, డిసెంబర్ నాటికి రాష్ట్రమంతా దీన్ని అమలు చేస్తాం. సింగిల్-యూజ్ ప్లాస్టిక్‌ను అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో నిషేధించాం. స్వయం సహాయ సంఘాల ద్వారా గుడ్డ సంచులు పంపిణీ చేస్తున్నాం. ఈ ప్రపంచంలో ఏదీ వేస్ట్ కాదు. ప్రతి దాని నుంచి సంపద సృష్టించవచ్చు. స్వచ్ఛతలో తిరుపతికి అవార్డు వచ్చింది. తిరుపతి పవిత్రమైన పుణ్యక్షేత్రం. దేశవిదేశాల నుంచి ఇక్కడి వస్తారు. ఈ ప్రాంతం పరిశుభ్రంగా లేకుంటే మనపై మంచి అభిప్రాయం ఉండదు' అని సీఎం తెలిపారు. స్వచ్ఛాంధ్రతోనే స్వర్ణాంధ్ర'స్వర్ణాంధ్ర సాధించాలంటే ముందు స్వచ్ఛాంధ్ర సాధించాలి. దీనికోసం సర్క్యులర్ ఎకానమీకి నాంది పలకాలి. సర్క్యులర్ ఎకానమీకి నమూనాగా తూకివాకంలో 300 ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్కు పెట్టాం. వినియోగించిన నీటిని లిక్విడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ కింద పరిశుభ్రం చేసి పొలాలకు పంపుతాం. లక్షలు, కోట్లు పెట్టి కొనుగోలు చేసిన కార్లలో వచ్చి చెత్తను రోడ్లపై వేస్తారు. మనం పీల్చే గాలి బయటనుంచే కదా వచ్చేది? దాన్ని కలుషితం చేస్తే పీల్చి అనారోగ్య పాలవుతాం' అని ముఖ్యమంత్రి అన్నారు. అక్టోబర్ 2 నాటికి పేరుకు పోయిన చెత్త తొలగింపు'123 మున్సిపాలిటీల్లో ప్లాస్టిక్ వేరు వేసే కేంద్రాలు ఏర్పాటు చేశాం. ప్రతీ రోజూ 8,899 టన్నుల వ్యర్థాలు వస్తున్నాయి. ఇందులో తడి వ్యర్థాలు 5,496 టన్నులు, పొడి వ్యర్థాలు 3,403 టన్నులుగా ఉంది. వీటి తరలింపు, రీయూజ్ సమర్థంగా జరుగుతోంది. గత ప్రభుత్వం చెత్త మీద పన్ను వేయడంపై పెట్టిన శ్రద్ధ తొలగింపుపై పెట్టలేదు. 86 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త వేసి పోయింది. అక్టోబర్ 2 నాటికి 86 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త తీయిస్తాం. ఈ ఏడాది డిసెంబర్‌కు 100 శాతం చెత్త క్లియర్ చేస్తాం. గ్రీన్ ఎనర్జీపై ప్రత్యేక దృష్టి'చిన్నప్పుడు కరెంటు లేక లాంతర్ వెలుతురులోనే చదువుకున్నాను. నేడు ఇంటిపైనే సోలార్ కరెంటు ఉత్పత్తి జరుగుతోంది. 20 లక్షల ఇళ్లపై సోలార్ కరెంటు అనుమతించాం. ఇల్లూ, ఆఫీస్, పొలాలు కరెంటు ఉత్పత్తి చేసే కేంద్రాలుగా తయారవుతున్నాయి. ఒకప్పుడు కరెంటు బొగ్గుతో తయారయ్యేది. నేడు విండ్ కరెంటు వచ్చింది. గ్రీన్ ఎనర్జీపై నేను శ్రద్ధ పెట్టాను. గ్లోబల్ వార్మింగ్ వల్ల అనేక సమస్యలు వస్తున్నాయి. దీనికి పరిష్కారం గ్రీన్ ఎనర్జీనే' అని ముఖ్యమంత్రి అన్నారు. ఇంట్లో చెత్తను ఊడ్చినట్లుగానే నేరస్తులనూ ఊడ్చేయండి 'రాజకీయాలు కలుషితమయ్యాయి. నేర చరిత్ర ఉన్నవారు రాజకీయాల్లోకి వచ్చారు. ప్రజల ఆస్తులను కబ్జా చేస్తున్నారు. మీ ఇంట్లో చెత్తను ఊడ్చేసినట్లుగానే రాజకీయాల్లో ఉన్న మలినాన్ని కూడా క్లీన్ చేయాలి. నేర రాజకీయాలు మనకు అవసరమా? వాటిని అడ్డుకోలేమా? ప్రజలు ఆలోచన చేయాలి. 2019 ఎన్నికలకు ముందు నేను మోసపోయాను. సాక్షి అని పత్రిక పెట్టారు. దాంతో చేసేవన్నీ వెధవ పనులే. పేరు మాత్రం సాక్షి. బాబాయ్ గుండెపోటుతో చనిపోయాడని సాక్షిలో వేశారు. సాయంత్రానికి గొడ్డలిపోటు అని డ్రామాలాడారు. చివరకు నారాసుర చరిత్ర అని నా చేతిలో కత్తి పెట్టి పత్రికలో రాశారు. ప్రజలు అయ్యో పాపం అనుకున్నారు. మళ్లీ మళ్లీ మోసం చేస్తే మనం మోసపోవాలా' అని సీఎం ప్రశ్నించారు. చిత్తూరులో పులివెందుల రాజకీయంఇటీవల బంగారు పాళ్యం రైతుల దగ్గరకు వచ్చి హడావుడి చేశాడు. మన ప్రభుత్వం రైతులను ఆదుకోవాలనే సదుద్దేశంతో టన్ను మామిడికి టన్నుకు రూ.12 వేలు ఇచ్చేలా చేసింది. ప్రభుత్వం తరపున రూ.4 వేలు, కొనుగోలుదారులు రూ.8 వేలు చెల్లించే ఏర్పాట్లు చేశాం. రైతుల పరామర్శకు వచ్చి రోడ్లపై మామిడి పండ్లు పోసి పులివెందుల రాజకీయం చేశాడు. హత్యా రాజకీయాలు నా జీవితంలో లేవు. రాష్ట్రంలో శాంతిభద్రతలు కాపాడాలని, ప్రజలకు భద్రతకు కల్పించాలని భావించాను. హింసా రాజకీయాలు నా దగ్గర కుదరవు. గత ఐదేళ్లలో ప్రజలకు స్వేచ్ఛ లేదు. ఎన్డీఏ వచ్చాక ప్రజలు సంతోషంగా ఉన్నారు' అని అన్నారు. ప్రాజెక్టులు పూర్తిచేసి రుణం తీర్చుంటా'రాయలసీమకు నీళ్లు తెచ్చింది టీడీపీనే. హంద్రినీవా, నగరి, గాలేరు, తెలుగుగంగ ప్రారంభించింది ఎన్టీఆర్ . తెలుగుగంగ ద్వారా తిరుపతికి నీరు అందించాం. తిరుపతిలో గరుడ వారధి నిర్మించి మేమే. వారధిని అలిపిరి వరకూ తీసుకెళ్తే ఆ దుర్మార్గులు మధ్యలో ఆపే ప్రయత్నం చేశారు. అవిలాల చెరువు సుందరీకరణను అడ్డుకున్నారు. రూ.3,850 కోట్లతో హంద్రీనీవా పనులు చేసి నీళ్లు విడుదల చేశాను. త్వరలో కుప్పం వరకూ నీరు అందిస్తాం. వెంకన్న చెంతకు హంద్రీనీవా నీరు వస్తుంది. మల్లెమడుగు ప్రాజెక్టు, బాలాజీ రిజర్వాయర్ రావాలి. మూలపేట చెరువు, కల్యాణ డ్యామ్‌కు నీళ్లు తీసుకొస్తాం. సోమశిల , స్వర్ణముఖి లింక్ కెనాల్ తీసుకొచ్చి వాటిని బాలాజీ రిజర్వాయర్‌కు కలుపుతాం. వీటిమధ్యలో వేణుగోపాల సాగర్ వస్తుంది. ఈ ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి నేను పుట్టిన చిత్తూరుజిల్లా రుణం తీర్చుకుంటా' అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పేద పిల్లలకు కుటుంబ పెద్దగా ఉంటా పేదపిల్లలకు కుటుంబ పెద్దలా తాను అండగా ఉంటానని, ఇది దేవుడు తనకు ఇచ్చిన అవకాశమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రజావేదిక సభలో పీ4 కార్యక్రమంపై సీఎం మాట్లాడారు. 'రాష్ట్రంలో 15 లక్షల నుంచి 20 లక్షల పేదకుటుంబా లను పైకి తీసుకురావాలన్న సంకల్పంతో ముందుకెళ్తున్నాం. 2029 నాటికికి పేదరికం లేని రాష్ట్రంగా ఏపీ ఆవిష్కృతం కావాలన్నది నా ఆశయం. ఈ పీ4 కార్యక్రమం ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తుంది. ఆ వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో పీ4 కార్యక్రమం సాకారమవుతుంది. బంగారం లాంటి పిల్లలకు చేయూతనిస్తే వారిలో విశ్వాసం పెరిగి మరో 10 మందికి సాయం చేసే శక్తి వస్తుంది. పిల్లలకు అవకాశం కల్పించే బాధ్యత నాది...పైకొచ్చే బాధ్యత వారిది. ఇంతకంటే సంతోషం మరొకటి ఉండదు. నిన్ననే 40 మంది పారిశ్రామిక వేత్తలో సమావేశమయ్యాను. వారు వేల కుటుంబాలను దత్తత తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నారు' అని సీఎం చంద్రబాబు అన్నారు. బంగారు కుటుంబానికి ఎంపికైన డి.వినూత మా ట్లాడుతూ... నేను ఇంటర్ బైపీపీలో 986 మార్కులు సాధిం చాను. ప్రస్తుతం లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకుంటున్నాను. నా చెల్లి అనిత ఇంటర్ పూర్తి చేసింది. నా తమ్ముడు గణేష్ 10వ తరగతి చదవుతున్నారు. మా అమ్మను 2014లో, నాన్నను కరోనా సమయంలో కోల్పోయాం. నాయనమ్మ, తాతయ్య సహకారంతో చదువుకుటుంటున్నాం. నేను మెడిసిన్, నా చెల్లి, తమ్ముడు సివిల్స్ చదవాలన్నది కోరిక. మాకు దారి చూపిస్తే చదువుకుని మంచిస్థాయికి వెళ్లి మరో మార్గదర్శిగా మారతాం.రోటరీక్లబ్ ప్రెసిడెంట్ రాజేంద్ర శెట్టి మాట్లాడు తూ.... వెంకటేశ్వరస్వామి ఇచ్చిన వరం సీఎం చంద్రబాబు. పీ4 కార్యక్రమాన్ని మంచి విజన్‌తో చంద్రబాబు రూపొం దించారు. ఈ పీ4 ద్వారా ఏపీ మోడల్ స్టేట్‌లా మారుతుంది. రోటరీ క్లబ్ తరపున వినూతను, ఆమె చెల్లి, తమ్ముడు చదువు బాధ్యతలను తీసుకుంటాం. ఈశ్వరి, బంగారు కుటుంబం 2019లో నా భర్త చనిపోయారు. నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. అత్తింటి వారు సహకరించడం లేదు. పెద్ద కుమా రుడు 8, చిన్న కుమారుడు 5వ తరగతి చదువుతున్నారు. నా పిల్లలకు మంచి విద్యను అందించాలని కోరుతున్నాను. శ్రీనివాస్, రాస్ విజ్ఞానకేంద్రం సీనియర్ శాస్త్రవేత్త ఈశ్వరికి మా సంస్థ ద్వారా బ్యూటిషియన్ కోర్సు అందించి ఆర్థికంగా బలపడేందుకు అవకాశం కల్పిస్తాం. ఆమె ఇద్దరు పిల్లలను మా సంస్థ ద్వారా చదివిస్తాం.

## తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మక కార్యక్రమం.. సుపరిపాలనలో తొలి అడుగు డోర్ టు డోర్

మొదటిపేజీ తరువాయి

అని పథకాలు వారికి అందుతున్నాయా లేదా, ఇంకా ఈ ప్రజా ప్రభుత్వం నుంచి ప్రజలు ఏం ఆశిస్తున్నారు లాంటి అంశాల గురించి తెలుసుకునేందుకు సుపరిపాలనలో తొలి అడుగు డోర్ టు డోర్ కార్యక్రమాన్ని మొదలుపెట్టింది తెలుగుదేశం పార్టీ. జులై 2న కుప్పంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునా యుడు, మంగళగిరిలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఈ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు.

### 50 లక్షలకు పైగా ఇళ్లు, అన్ని నియోజకవర్గాల్లో తొలి అడుగు డోర్ టు డోర్ కార్యక్రమం

సుపరిపాలనలో తొలి అడుగు డోర్ టు డోర్ కార్యక్రమం ద్వారా ఇంటింటికీ సంక్షేమం, అభివృద్ధి విజన్‌ను వివరిస్తూ.. రాష్ట్రవ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులు తమ పరిధిలోని ప్రతీ ఇంటికి వెళ్తున్నారు. ప్రతీ ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి వివరిస్తున్నారు. అంతేకాకుండా... ఆయా కుటుంబాలకు అందుతున్న పథకాల గురించి కూడా తెలుసుకుని... ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి పథకాల్ని, కార్యక్రమాలను ఆశిస్తున్నారు లాంటి అంశాల్ని కూడా నమోదు చేసుకుంటున్నారు. మొత్తంగా ఈ 18 రోజుల్లో 50 లక్షలకు పైగా ఇళ్లను సందర్శించి సరికొత్త రికార్డుని సృషించారు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు. తద్వారా తెలుగుదేశం పార్టీ కార్యకర్తల పార్టీ మరోసారి నిరూపించినట్లైంది.

### సుపరిపాలనలో తొలి అడుగు డోర్ టు డోర్ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యాలు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న సంక్షేమ పథకాలు పింఛన్లు, మెగా డీఎస్సీ, తల్లికి వందనం, అన్న క్యాంటీన్లు, దీపం 2 పథకం వంటి వాటిగురించి ప్రజలకు వివరిస్తున్నారు.ఆ ప్రాంతంలో ప్రభుత్వం వచ్చిన తర్వాత చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల్ని తెలియజేస్తున్నారు.ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు గురించి చెపుతున్నారు.పెట్టుబడుల ద్వారా మన యువతకు అందివస్తోన్న ఉద్యోగాకవకాశాలు తెలియజేస్తున్నారు.ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అన్నది ప్రత్యక్షంగా తెలుసుకుంటున్నారు. రాబోయే నాలుగేళ్లలో చేపట్టబోయే అభివృద్ధి చర్యలను వివరిస్తున్నారు. ప్రభుత్వం నుంచి ప్రజలు ఇంకా ఎలాంటి సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు ఆశిస్తున్నారో తెలుసుకుంటున్నారు.మూడు ప్రాంతాలు.. మూడు కరపత్రాలు*సుపరిపాలనలో తొలి అడుగు డోర్ టు డోర్ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా చేపట్టింది తెలుగుదేశం పార్టీ. ఆయా ప్రాంతాల్లో ఇప్పటివరకు జరిగిన అభివృద్ధి వివరిస్తూ, దీంతోపాటు ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాల వివరాల్ని కూడా ఒక కరపత్రం రూపంలో సిద్ధం చేసి ప్రజలకు అందించింది. ఆయా ప్రాంతాల్లో చేపట్టిన కార్యక్రమాలను వివరిస్తూ....ఉత్తరాంధ్ర, మధ్యాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు విడివిడిగా కరపత్రాల్ని సిద్ధం చేసి కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరిగిన సంక్షేమాన్ని, అభివృద్ధిని ప్రజలకు చాలా స్పష్టంగా తెలిసేలా చేసింది తెలుగుదేశం పార్టీ.ప్రతీ ఒక్కరూ కచ్చితంగా డోర్ టు డోర్ కార్యక్రమంలో పాల్గొనాల్సిందేతెలుగుదేశం పార్టీ అంటేనే క్రమశిక్షణకు మారుపేరు. ఇక్కడ కార్యకర్తే అధినేత. పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రతీ ఒక్క కార్యకర్త ఉత్సాహంగా పాల్గొన్నాడు. అందుకే వారికి మరింత ప్రోత్సాహన్ని అందించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుప్పంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. మరోవైపు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ గారు మంగళగిరి నియోజకవర్గంలోని తాడేపల్లి మహానాడు కాలనీలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందిస్తూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అందుతున్నాయో లేదో తెలుసుకున్నారు. కేంద్రమంత్రులు, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా తమ నియోజకవర్గ పరిధిలో ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు. మంత్రి నారా లోకేష్ పర్యవేక్షణలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంసుపరిపాలనలో తొలి అడుగు డోర్ టు డోర్ కార్యక్రమాన్ని మంత్రి నారా లోకేష్ గారు చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. అందుకే కార్యక్రమం మొదలైన దగ్గరనుంచి ఈరోజు వరకు ప్రతీరోజూ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో ప్రతీ రోజూ మాట్లాడారు. వారిని ఎప్పటికప్పుడు మోటివేట్ చేస్తూ కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు నిరంతరంగా కృషి చేస్తున్నారు. ఉత్సాహంగా పనిచేసిన కార్యకర్తల్ని, నాయకుల్ని మంత్రి నారా లోకేష్ గారు స్వయంగా అభినందిస్తున్నారు. మీ వెనుక నేనున్నానంటూ భరోసా కల్పిస్తున్నారు. ఏ చిన్న సమస్య రాకుండా టెక్నాలజీ ద్వారా ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు అందిస్తున్నారు. అంతేకాకుండా ఎక్కడ ఏ సమస్య వచ్చినా వెంటనే తెలుసుకుని దాన్ని పరిష్కరిస్తున్నారు. మరోవైపు మంత్రులు కూడా దాదాపు 80 నుంచి 85 నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమంలో పాల్గొనేలా కార్యక్రమాన్ని లోకేష్ రూపొందించారు. డోర్ టు డోర్ కార్యక్రమం జరుగుతున్న తీరుపై ఎప్పటికప్పుడు డ్యాష్ బోర్డు ద్వారా పర్యవేక్షణ..సుపరిపాలనలో తొలి అడుగు డోర్ టు డోర్ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ యొక్క CUB (క్లస్టర్, యూనిట్, బూత్) నాయకుల దగ్గరనుంచి, కుటుంబ సాధికార నాయకులు, పొలిట్ బ్యూరో వరకు అందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు. వారంతా ఈ కార్యక్రమంలో పాల్గొనేలా ఎప్పటికప్పుడు SMSలు, IVRSల ద్వారా అలర్ట్ చేశారు. అంతేకాకుండా వారు ఎన్ని ఇళ్లకు వెళ్లారు అనే విషయాన్ని సాయంత్రానికి డ్యాష్ బోర్డ్ లో అప్డేట్ అయ్యేలా చూశారు. దీనిద్వారా తక్కువ రోజుల్లోనే ఎక్కువ ఇళ్లని కవర్ చేయగలిగారు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు.స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యంగా రాష్ట్ర పునర్నిర్మాణాన్ని తలకెత్తుకున్న తెలుగుదేశం ప్రభుత్వ నిబద్ధతకు ఈ సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ఒక అద్భుతమైన నిదర్శరనం. అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు ప్రత్యక్షంగా తెలియజేయడం ద్వారా ప్రజల నమ్మకాన్ని మరింత పొందే విధంగా సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరుగుతోంది.

# బాలికల హాస్టల్ ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

ప్రజాభూమి మార్కాపురం



మార్కాపురంలోని ఎస్సీ బాలికల హాస్టలును సందర్శించిన జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాహాస్టల్ ప్రాంగణంలోసదుపాయాలు, ఆహార నాణ్యత పై హారతిశారు అనంతరం వంటగదిని ప్రత్యేకంగా పరిశీలించి. ఏకాంతంగా విద్యార్థినులతో మాట్లాడి తాగునీటి నాణ్యతలో నిర్లక్ష్యం ఉండకూడదని హాస్టల్లో ఏదైనా సమస్య ఉంటే కంప్లైంట్ బాక్సు లో రాసి వేయాలని విద్యార్థినులకు సూచించిన జిల్లా కలెక్టర్ అమిత్ అన్సారీ

## ముఖ్యమంత్రి నారా చంద్రబాబు కష్టంలో భాగస్వామ్యం భాగమవుతాం చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి..!

ప్రజాభూమి ,చంద్రగిరి:



రాష్ట్ర అభివృద్ధి కోసం, ప్రజా సంక్షేమ కోసం, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పగలనక రేయనక కష్టపడుతున్నారని, ఆయన కష్టంలో తాము భాగస్వామ్యం అవుతున్నామని,తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్, టిటిడి బోర్డు సభ్యులు డాలర్స్ దివాకర్ రెడ్డిఅన్నారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తిరుపతి పర్యటనలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి వెంట తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తుడా చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కోసం, ప్రజా సంక్షేమం కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రోజుకి దాదాపు 19 గంటల పాటు శ్రమిస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి ఆలోచన,తపన నిరంతరం ప్రజల చుట్టూనే తిరుగుతూ ఉందని పేర్కొన్నారు.. చంద్రబాబు నాయుడు లాంటి ముఖ్యమంత్రి దొరకడం ఆంధ్ర రాష్ట్ర ప్రజల అదృష్టం అన్నారు. ముందుచూపు దార్శిని కథ కలిగిన చంద్రబాబునాయుడు లాంటి ముఖ్యమంత్రితో తాను కలిసి పనిచేయడం తనకు ఎంతో అదృష్టం అన్నారు.

## పురాతన కట్టడాలపై అవగాహన

ప్రజాభూమి, గుంతకల్లు ప్రతినిధి (గుత్తి):




గుత్తి కోట సంరక్షణ సమితి ఆధ్వర్యంలో పురాతన కట్టడాలపై శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గుత్తి గేట్స్ ఇంజనీరింగ్ పాలిటెక్నిక్ విద్యార్థులు, అధ్యాపకులు గుత్తి కోటకు ట్రెక్కింగ్ చేశారు. ముందుగా కోట దిగువ భాగంలో కోట సంరక్షణ సమితి సభ్యుల బృందం పురాతన కట్టడాలను ఎలా సంరక్షించాలి.. అందరూ బాధ్యత తీసుకొనే చర్యల గురించి సంరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు విజయభాస్కర్ చౌదరి తెలిపారు. ఈ సందర్భంగా గుత్తి కోట గైడ్ రమేష్ గుత్తి కోట చరిత్ర, ప్రాశస్త్యాన్ని వివరించారు.ఈ కార్యక్రమంలో గుత్తి కోట సంరక్షణ సమితి గౌరవ సలహాదారులు సూర్యనారాయణ రెడ్డి, గుత్తి కోట బాబా సాహెబ్, సంరక్షణ యువజన సమితి కన్వినర్ హెచ్. ఎం. జిలాన్, సోషల్ మీడియా కన్వినర్ శివ, పురావస్తు సిబ్బంది చైతన్య, ఆంజనేయులు అమృత్, గేట్స్ ఇంజనీరింగ్ కాలేజీ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల ప్రారంభానికి.. కసాపురం ఆంజనేయస్వామి దేవస్థానాన్ని సందర్శించిన కర్నూలు ఎండోమెంట్ శాఖ డీఈఈ శ్రీనివాసులు

ప్రజాభూమి, గుంతకల్లు ప్రతినిధి:



మండల పరిధిలో వెలసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవస్థానాన్ని దర్శించేందుకు వచ్చే భక్తుల సౌకర్యార్థం నూతనంగా నిర్మించనున్న కట్టడాలకు సంబంధించి శనివారం కర్నూలు దేవాదాయ శాఖ డీఈఈ సిహెచ్ శ్రీనివాసులు సందర్శించారు. ఈ సందర్భంగా నూతనంగా రూపొందించిన మాస్టర్ ప్లాన్ అనుగుణంగా పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు రాష్ట్ర దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఈ మేరకు ఆలయ పరిసరాల్లో ఈ కట్టడాలను నిర్మించేందుకుగాను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈ ఓ కె. వాణి, కర్నూలు దేవాదాయ శాఖ ఏఈలు, టెక్నీషియన్లు, కసాపురం దేవస్థానం సహాయ కార్యనిర్వహణాధికారి తదితరులు పాల్గొన్నారు.

## చైర్మన్ ను పరామర్శించిన మాజీ చైర్మన్

ప్రజాభూమి, పులివెందుల



నూర్ బాషా కార్పొరేషన్ మాజీ చైర్మన్ ,వైయస్సార్ కాంగ్రెసు పార్టీ నూర్ భాషా దూదేకుల విభాగం రాష్ట్ర అధ్యక్షులు ఓతూరు రసూల్ శనివారం కృష్ణ జిల్లా పరిషత్ చైర్మన్ ఉప్పాల హారిక ను పరామ ర్శించారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన దాడికి నిరసనగా వారికి సంఘీభావం తెలిపారు.ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూమాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కార్యకర్తలకి ఎల్లప్పుడూ అండగా ఉంటారని తెలిపారు. రాబోయే రోజులు మంచి రోజులు వస్తాయని ఓపిగ్గా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసి చైర్మన్ ఆకివీడు హుస్సేన్ , కనిగిరి పొద్దుటూరి బాజీ , కృష్ణ జిల్లా వైసిపి నాయకులు పులిమద్ది చిన్న మస్తాన్ , వైసిపి నాయకులు షేక్ బుడే , గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## అర్చకుల సమస్యలను ముఖ్యమంత్రికు వివరిస్తున్న తుడా చైర్మన్..

ప్రజాభూమి, చంద్రగిరి:(తిరుపతి)



తిరుపతి పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి తిరుపతి విమానాశ్రయంలో తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం టిటిడిలో పని చేస్తున్న కాంట్రాక్ట్ అర్చకుల సమస్యలను తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి వివరించారు. ముఖ్యమంత్రి కి అర్చకులు చేత వినతి పత్రం అందజేయించారు. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందిస్తూ అర్చకుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తమ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లిన తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డికి అర్చకులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## చేతివృత్తులకు చేయూతగా విశ్వకర్మ యోజన పథకం:: ఆకాశవాణి రీజినల్ న్యూస్ హెడ్ హెన్రీ రాజ్

ప్రజాభూమి ప్రతినిధి, విజయవాడ:



సాంప్రదాయ కళాకారులు మరియు చేతివృత్తుల వారికి ఆర్థిక మద్దతు ఇవ్వడం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకం విశ్వకర్మ యోజనను ఉపయోగించుకోవాలని, ఆల్ ఇండియా రేడియో ప్రాంతీయ వార్తా విభాగం అధిపతి హెన్రీ రాజ్ శనివారం విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని ఎంఎల్ఎ క్యాంప్ ఆఫీస్ లో 'మై భారత్' వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కేంద్ర ప్రభుత్వ పథకాలపై ఒక రోజు వర్క్‌షాప్‌లో లబ్ధిదారులకు విజ్ఞప్తి చేశారు. 'మై భారత్' వర్క్‌షాప్‌కు ముఖ్య అతిథిగా హాజరైన హెన్రీ రాజ్, విశ్వకర్మ యోజన సాంప్రదాయ కార్మికుల నైపుణ్యాలను దేశాభివృద్ధికి ఉపయోగించుకునేలా రూపొందించబడిందని ,దేశ పురోగతికి దోహదపడటానికి ప్రతి వ్యక్తి వ్యవస్థాపకుడిగా మారాలని సూచించారు.

ఈ సందర్భంగా యువతను ఉద్దేశించి మాట్లాడుతూ, యువత సోషల్ మీడియా తప్పుడు కథనాల ఉచ్చులో పడకూడదని, ప్రభుత్వ పథకాలను వినియోగించుకొని దేశాభివృద్ధి లో భాగస్వాములు కావాలని కోరారు. అదేవిధంగా, జిల్లా యువజన అధికారి (మై భారత్) సుంకర రాము కూడా యువత ప్రభుత్వ పథకాలను ఇంటింటికి తీసుకెళ్లాలని కోరారు.పీఎంఈజీపీ (ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం) గురించి వివరిస్తూ, భవానీపురం ఎస్ బీ ఐ బ్రాంచ్ మేనేజర్ సత్యనారాయణ యువత ఆలోచన ప్రభుత్వ ఉద్యోగాలకు మాత్రమే పరిమితం కాకుండా పీఎంఈజీపీ పథకాన్ని ఉపయోగించుకొని పరిశ్రమలను స్థాపించే దిశగా అన్ని రంగాలలో అవకాశాలను అన్వేషించాలని విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో, యూనియన్ బ్యాంక్ భవానీపురం మేనేజర్, సుజన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం పథకం పీఎం ఆవాస్ యోజన క్రింద పేదలు ఇళ్ల నిర్మాణానికి 1.8 లక్షల వరకు సబ్సిడీలను పొందవచ్చని, లబ్ధిదారులు మరిన్ని వివరాలకోసం సమీప బ్యాంకులను సంప్రదించాలని ఆమె పేర్కొన్నారు.దూరదర్శన్ న్యూస్ ఆంధ్రా రీజియన్ ఎడిటర్ పురుషోత్తం రెడ్డి సహా స్థానిక ప్రజలు , యువత ఈ వర్క్‌షాప్‌కు హాజరయ్యారు.వర్క్‌షాప్‌లో భాగంగా సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ భారత ప్రభుత్వ వివిధ పథకాలకు సంబంధించిన పుస్తకాల స్టాల్‌ను ఏర్పాటు చేసింది. అదేవిధంగా 11 సంవత్సరాల %చీణూ% ప్రభుత్వ పాలన మరియు పురోగతిపై సమాచార మరియు ప్రసార మంత్రిత్వ శాఖ ప్రచురించిన పుస్తకం కూడా వర్క్ షాప్ లో విడుదల చేశారు .

## కంటి ఆపరేషన్ చేసిన వారికి ఉచిత పరిక్షలు- రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి

### - మానవత చైర్మన్ బి. చక్రపాణిరెడ్డి

ప్రజాభూమి, వేంపల్లె



మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గత నెల జూన్ మాసంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం ద్వారా కంటి ఆపరేషన్ చేయించుకున్న వారికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించినట్లు ఆ సంస్థ ఛైర్మన్ బి. చక్రపాణిరెడ్డి తెలిపారు. శనివారం స్థానిక శ్రీ చైతన్య ఉన్నత పాఠశాలలో కంటి ఆపరేషన్ చేయించుకున్న 100 మందికి ఉచిత కంటి పరీక్షలు చేశారు. దీంతో పాటు ఉచితంగా మందులు, కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మానవత సంస్థ ఛైర్మన్ మాట్లాడుతూ మానవత ద్వారా వివిధ సేవలతో పాటు వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. అంతేకాకుండా నేడు ఆదివారం స్థానిక శ్రీచైతన్య ఉన్నత పాఠశాల ఆవరణంలో రమాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ తిరుపతి వారి సౌజన్యంతో వివిధ వైద్య సేవలు అందించే దిశగా ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని, అలాగే వివిధ వ్యాధుల సమస్యలతో బాధపడుతున్న వారి కోసం రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. యువత ముందుకు వచ్చి రక్తదానం చేయాలని, రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని పిలుపునిచ్చారు. మానవ సేవే మాధవ సేవగా ప్రతి ఒక్కరూ భావించి, ఉత్తమ సమాజ నిర్మాణానికి భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మానవత అధ్యక్షుడు డా.యోగశ్వరబాబు, అరవింద్ కంటి ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, మానవత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఆర్కేవ్యాలీలో స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్- పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

ప్రజాభూమి, వేంపల్లె



ఇడుపులపాయలోని ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీ క్యాంపస్ లో స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం జాతీయ సేవా పథకం యూనిట్-14 ఆధ్వర్యంలో ప్లాస్టిక్, వ్యర్థ పదార్థాలు, పిచ్చి మొక్కలు తొలగించినట్లు ప్రోగ్రాం అధికారి డా. తిరుపతి రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వస్తువుల వాడకం వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే పరిసర ప్రాంతాల పరిశుభ్రతతో వర్షకాల వ్యాధుల నుంచి కాపాడుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో పరిపాలనాధికారి డా. రవి కుమార్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా.జె.దీప్తి తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేద్దాం.

### పోరుమామిళ్ల మేజర్ సర్పంచ్ యనమల సుధాకర్

ప్రజాభూమి పోరుమామిళ్ల :



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే స్వర్ణాంధ్రు- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతినెల మూడవ శనివారం నిర్వహించే ఈ కార్యక్రమాన్ని పోరుమామిళ్ల పట్టణ పంచాయతీ కార్యాలయ ఆవరణంలో పోరుమామిళ్ల పట్టణ మేజర్ పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్స్, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొని పట్టణంలో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సర్పంచ్ యనమల సుధాకర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్రు-స్వచ్ఛ్ ఆంధ్ర అనే కార్యక్రమం రాష్ట్ర ఆర్థిక అభివృద్ధిని, పర్యావరణ పరిశుభ్రతను సాధించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిందని, వ్యక్త పదార్థాలు నిర్వహణను మెరుగుపరచడం, పర్యావరణాన్ని పరిరక్షే విధంగా ఈ కార్యక్రమాన్ని ప్రతినెల మూడో శనివారం నిర్వహించు కుంటున్నామన్నారు. అలాగే పట్టణంలో ప్లాస్టిక్ కాలుష్య నిర్మూలనకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈవో ఓబులేష్, పారిశుద్ధ్య కార్మికులు, విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు, అంగన్వాడి టీచర్స్ పాల్గొన్నారు.

## కాలుష్య నిర్మూలనకు ఐక్యంగా కృషి చేద్దాం

### -"స్వచ్ఛ ఆంధ్ర %-% స్వర్ణ ఆంధ్ర"లో బిట్ విద్యార్థుల ఇంటింటా ప్రచారం


ప్రజాభూమి, హిందూపురం టౌన్



రోజురోజుకు పెరిగిపోతున్న కాలుష్యాన్ని నియంత్రించేందుకు అందరూ ఐక్యంగా కృషి చేద్దామని బిఐటి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల చైర్మన్ చంద్రమోహన్ పిలుపునిచ్చారు. శనివారం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రమేష్ ఆధ్వర్యంలో "స్వచ్ఛ ఆంధ్ర %-% స్వర్ణ ఆంధ్ర" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ప్లాస్టిక్ కాలుష్యం, పర్యావరణంపై కలిగే హానిపై చైతన్య అవగాహన కార్యక్రమాలను తమ కళాశాల విద్యార్థులు నిర్వహించినట్లు తెలిపారు. నిర్వహించారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, గ్రామ ప్రజలను సమూహాలుగా చేర్చి వివిధ అంశాలపై అవగాహన కల్పించినట్టు తెలిపారు. ముఖ్యంగా 120 మైక్రాన్ల కన్నా తక్కువ మందంతో తయారైన ప్లాస్టిక్ బ్యాగుల వాడకాన్ని తగ్గించడం, ఒకే ఒక్కసారి వాడే ప్లాస్టిక్ వస్తువుల వినియోగంపై నియంత్రణ, సూక్ష్మ ప్లాస్టిక్‌ల వలన ఆరోగ్యానికి కలిగే దుష్పరిణామాలు, వనరుల పునర్వినియోగాన్ని ప్రోత్సహించే అంశాలపై ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించినట్లు తెలిపారు. గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి, ప్లకార్డులు, పోస్టర్లు, నినాదాల ద్వారా ప్రజల్లో చైతన్యం పెంచారని తెలిపారు. దీనికి తోడు ఇంటింటికీ వెళ్లి సూచనలతో కూడిన సమాచారం పంపిణీ చేయడంతో పాటు, చిన్న పిల్లలు, మహిళలు, వృద్ధులకు ప్రత్యేకంగా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా గ్రామస్థుల్లో ప్లాస్టిక్ వాడకం తగ్గించాల్సిన అవసరం, దాని వల్ల కలిగే ప్రమాదాలపై అవగాహన ఏర్పడుతుందని కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎ రమేష్ తెలిపారు. పర్యావరణ పరిరక్షణ దిశగా ఇది ఒక మంచి అడుగు అని కళాశాల చైర్మన్ చంద్ర మోహన్ అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టండి..!

ప్రజాభూమి, గుంతకల్లు ప్రతినిధి:



మండలంలోని కసాపురం గ్రామంలో వెలసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానానికి దర్శనార్థం వచ్చే భక్తుల సౌకర్యార్థం పలు వసతి సౌకర్యాలను మాస్టర్ ప్లాన్ కు అనుగుణంగా ఎంపీ నిధులతో చేపట్టాలని ఆలయ ఈ ఓ కె.వాణి అనంతపురం ఎంపీ అంబిక లక్ష్మీనారాయణ కోరారు. ఈ మేరకు ఆమె ఆలయ అధికారులు, సిబ్బంది తో కలిసి శనివారం అనంతపురంలో ఎంపీ ని కలిసి నూతనంగా రూపొందించిన మాస్టర్ ప్లాన్ చూపారు. మాస్టర్ ప్లాన్ కి అనుగుణంగా ఎంపీ నిధులతో దేవస్థానంలో భక్తులకు అవసరమైన వసతులు సౌకర్యాలను నిర్మించాల్సిందిగా ఆమె ఎంపీని కోరారు. ఈ కార్యక్రమంలో ఆమెతోపాటు ఆలయ సహాయ కార్య కార్యనిర్వాహణాధికారి ఓ. వెంకటేశ్వరుడు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రారంభమైన ఆండాళ్ అమ్మవారి తిరువడిపురం ఉత్సవం.!

ప్రజా భూమి, చంద్రగిరి: (తిరుపతి)



తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో శనివారం శ్రీ ఆండాళ్ అమ్మవారి తిరువడిపురం ఉత్సవం ఘనంగా ప్రారంభమైంది. ఇందులో భాగంగా ఉత్సవ రోజుల్లో ఉదయం 6 నుండి 6.30 గంటల వరకు శ్రీ ఆండాళ్ అమ్మవారికితిరుమంజనం, సాయంత్రం 5.30 నుండి రాత్రి 7 గంటల వరకు అమ్మవారిని ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.జూలై 28న శ్రీ ఆండాళ్ అమ్మవారి శాత్తుమొర సందర్భంగా ఉదయం 9.30 నుండి 10.30 గంటల వరకు శ్రీ గోవిందరాజస్వామివారు, శ్రీ ఆండాళ్ అమ్మవారి ఉత్సవమూర్తులకు స్నపనతిరుమంజనం నిర్వహిస్తారు. సాయంత్రం 4 నుండి రాత్రి 8 గంటల వరకుశ్రీగోవిందరాజస్వామివారు, శ్రీ ఆండాళ్ అమ్మవారిని అలిపిరికి ఊరేగింపుగా తీసుకెళ్లి అక్కడ ఆస్థానం నిర్వహిస్తారు. ప్రత్యేక పూజల అనంతరం అలిపిరి నుండి రామనగర్ క్వార్టర్స్ లోని గీతా మందిరం, ఆర్ఎస్ మాడ వీధి లోని శ్రీ విఖనసాచార్యుల ఆలయం, శ్రీ చిన్నజీయర్ మఠం మీదుగా ఊరేగింపు తిరిగి ఆలయానికి చేరుకుంటుంది. రాత్రి 8 గంటలకు శ్రీ ఆండాళ్ అమ్మవారి సన్నిధిలో శాత్తుమొర నిర్వహిస్తారు.ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో వి.ఆర్.శాంతి, ఏఈవో భాస్కర నారాయణ చౌదరి ఇతర అధికారులు పాల్గొన్నారు.

# నేడు గుడ్లగురవమ్మ అమ్మవారికి ఆషాడ మాస సారె

ప్రజా భూమి , కామవరపుకోట



మండలంలోని పాతూరు శివారు వాలీ సుగ్రీవుల గట్టు సమీపంలో ఉన్న శ్రీ గుడ్ల గురవమ్మ అమ్మవారికి ఆషాడ మాస సారె కార్యక్రమం ఆదివారం నిర్వహిస్తున్నట్టు ఆలయ అభివృద్ధి కమిటీ తెలిపింది. వాలీ సుగ్రీవుల గట్టు సమీపంలో పాతూరు – మద్దుకూరు, వడ్లపల్లి రహదారిని ఆనుకుని ఉన్న గుడ్ల గురవమ్మ అమ్మవారికి శతాబ్దాల చరిత్ర ఉంది. పాతూరు, కోట సమీప ప్రాంతాల భక్తులు ఉదయం 9 గంటలకు పాతూరులోని రామాలయంకు చేరుకుంటారు. అక్కడ విఘ్నేశ్వర పూజ అనంతరం.. వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలతో భారీ ఊరేగింపుగా అమ్మవారికి సారె తీసుకువెళ్లే కార్యక్రమం ఉంటుంది. కార్యక్రమంలో పాతూరు, కోట సమీప ప్రాంతాలకు చెందిన భక్తులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కమిటీ పేర్కొంది.

# రుద్రంకోట గ్రామంలో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛఆంధ్ర

ప్రజాభూమి, వేలేరుపాడు



మండలం లోని రుద్రంకోట గ్రామ పంచాయతీ పరిధిలో రుద్రం కోట గ్రామం లో శనివారం స్వర్ణ ఆంధ్రా, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రతీ మూడవ శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛంధ్రా, పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం ఉంటుంది అని రుద్రం కోట గ్రామ పంచాయతీ సెక్రటరీ కె. వెంకటేశ్వరావు తెలియ జేశారు.ప్లాస్టిక్ కాలుష్యం మనకు హానిచేస్తుంది అని, ప్లాస్టిక్ సంచులు వద్దు, గుడ్డ సంచులు ముద్దు, ప్లాస్టిక్ ని బహిష్కరించండి కాలుష్యన్ని నివారించండి అనే నినాదాలతో సచివాలయం సిబ్బంది , అలాగే గ్రామ ప్రజలు సచివాలయం నుండి స్కూల్ వరకూ ర్యాలీ నిర్వహించి , మహాలక్ష్మి గుడి వద్ద ఉన్న రచ్చబండ వద్ద మానవ హారం నిర్వహించారు. అదేవిదంగా ఈ కార్యక్రమం లో కూటమి నాయకులు సారె. బాబ్జి మాట్లాడుతూ, ఇంటి ఆవరణలో పరిశుభ్రంగా ఉంచాలని,నీటి గుంతలు లేకుండా చూడాలని అన్నారు.దోమలు లేకుండా చేసి ఆరోగ్యంగా ఉండాలని అప్పుడే స్వర్ణ ఆంధ్రా, స్వచ్ఛ ఆంధ్రా సార్థక మౌతుంది అని తెలియ జేశారు. ఈ కార్యక్రమం లో గ్రామ ప్రజలు, సచివాలయం సిబ్బంది , ఉపాధి సిబ్బంది, తుంగా. శ్రీను , కొవ్వా ల. రామకృష్ణ పాల్గున్నారు.



# విద్యుత్ స్తంభాల పునరుద్ధరణకై సరఫరా నిలిపివేత

ప్రజా భూమి, వేలేరుపాడు

గాలి వాన కారణంగా కుప్పకూలిన విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించేందుకై నేడు (ఆదివారం) విద్యుత్ సరఫరాను ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సరఫరా నిలిపివేయి ఉన్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్ ఖాన్ ఒక ప్రకటనలో తెలియజేశారు. వేలేరుపాడు మండలానికి కుక్కునూరు మండలానికి విద్యుత్ సరఫరాగు ప్రధాన లైను( 33 కెవి) మధ్యలోనే నెమలిపేట వద్ద తాటి చెట్టు పడి స్తంభం విరిగిపోవడం జరిగిందని, ఆ స్తంభాన్ని పునరుద్ధరించేందుకై ఈ రెండు మండలాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడిందని తెలిపారు. కావున వినియోగదారులు సహకరించవలసిందిగా ఆయన ఈ ప్రకటనలో కోరారు.

# ప్లాస్టిక్ రహిత సమాజం కొరకు అవగాహన ర్యాలీ

ప్రజాభూమి, వి.ఆర్.పురం.



చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ప్లాస్టిక్ రహిత సమాజం కొరకు శనివారం గ్రామంలో ప్లకార్డులు, నినాదాలతో ర్యాలీ చేసి, అనంతరం మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా. కె. రత్న మాణిక్యం ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై కీలక సందేశాన్ని ఇచ్చారు. అనంతరం వైస్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిలో కలిసేందుకు శతాబ్దాలు పడతాయనీ, అవి నేల నీరు వాతావరణాన్ని కలుషితం చేస్తాయనీ, విద్యార్థినీ విద్యార్థులు ఇప్పటి నుంచి ఈ విషయాన్ని తెలుసుకొని ప్లాస్టిక్ వినియోగాన్ని విడనాడాలన్నారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో మరియు మెయిన్ రోడ్ లో పిచ్చి మొక్కలను తొలగించి పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జి.సాయికుమార్, సీనియర్ అధ్యాపకులు జి. వెంకట్రావు, ఎస్ అప్పనమ్మ, జి. హారతి, కె.శకుంతల, కె. శైలజ, ఎం నాగ మోహన్ రావు,బి. శ్రీనివాస రావు, ఆర్.మౌనిక,పి. మౌనిక, ఎన్ వి వి ఎస్ ఎన్ మూర్తి, సంగం నాయుడు, శీనయ్య, సుబ్బారావు, కన్నయ్య విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదానికి గురైన బాధితున్ని పరామర్శించిన వైసీపీ నాయకులు

ప్రజాభూమి, వి.ఆర్.పురం.



గత వారం రోజుల క్రితం మండల పరిధి కొప్పల్లి గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త కారం సీతరామయ్య కుమారుడు కారం సింగరాజు, తులసిపాక గాట్ రోడ్ లో బైక్ ప్రమాదానికి గురి అయి, కాలు విరిగి భద్రాచలంలో చికిత్స పొంది ఇంటికి వచ్చిన బాధితున్ని మండల వైసీపీ నాయకులు శనివారం పరామర్శించారు. ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని, ఏ అవసరం వచ్చినా మాకు తెలపాలని మీకు మేము అండగా ఉంటామని నాయకులు బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పారు. కాలేజ్ పనిమీద మారేడుమిల్లి వెళ్లేందుకు బైక్ పై వెళ్తున్న క్రమంలో తులసిపాక వద్ద ఎదురుగ వస్తున్న లారిని తప్పించబోయి కింద పడటంతో కూడి కాలు విరిగినదని, భద్రాచలంలో ఓ ప్రవేట్ హాస్పిటల్లో ఆపరేషన్ చేపించుకొని ఇంటికి తీసుకువచ్చినట్లు సీతారామయ్య నాయకులకు తెలిపారు. ఈ కార్యక్రమం లో చినమ్మట్టపల్లి సర్పంచ్ పిట్టా రామారావు, ఆర్ టీ ఐ విభాగం జిల్లా అధ్యక్షులు బొడ్డు సత్యనారాయణ, జిల్లా అధికారప్రతినిధి చిక్కాల బాలకృష్ణ (బలు ), మండల నాయకులు చింతరేవుపల్లి పిసా అధ్యక్షులు కోటం జయరాజు, ఎస్సీ సెల్ నాయకులు మాచర్ల వెంగలరవు, స్థానిక కార్యకర్తలు సోడి రంగారావు, పెంటయ్య, సోడి రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.

# సత్రంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం

ప్రజాభూమి ఏలూరు ప్రతినిధి



"స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర " కార్యక్రమంలో – భాగంగా శనివారం సత్రంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు జరిగిన కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంట పద్మ శ్రీ మాట్లాడుతూ విద్యార్థులకు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే హానికర ప్రభావాలను వివరించి, పాఠశాలలను ప్లాస్టిక్ రహిత పరిసరాలుగా మార్చాల్సిన అవసరాన్ని వివరించారు.పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ, స్వయంగా పాఠశాల ఆవరణలో శుభ్రత కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులు, సిబ్బందితో కలిసి పాఠశాల పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి, ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించేందుకు తీసుకోవాల్సిన నిబద్ధతపై ప్రోత్సాహం ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పలువురు స్థానిక అధికారులు పాల్గొన్నారు.

# "కోట " మండలంలో దొంగలు రెచ్చిపోతున్నారు

**రైతుల ట్రాన్స్ఫర్మర్లు కేబుల్స్ కోకో గింజలుపై పెరుగుతున్న దొంగతనాలు**

**వ్యవసాయ సీజన్ ప్రారంభవుతో రైతులు గగ్గోలు**

ప్రజా భూమి, కామవరపుకోట

వ్యవసాయ సీజన్ ప్రారంభం అవ్వడంతో మెట్ట ప్రాంతంలోని రైతులు దొంగలకు భయపడి రాత్రింబవళ్లు దొంగల కోసం వేసి చూస్తున్నారు. ఏ రోజు ఏ ప్రాంతంలో దొంగతనం జరుగుతుందో తెలియక అయోమయ పరిస్థితి నెలకొంది. దొంగలకు ఆదాయం, రైతులకు ప్రాణ సంఘటనగా మారింది. కామవరపుకోట మండలం తాడిచర్ల దొరసానిపాడు పరిసర ప్రాంతాల్లో గత 20 రోజుల నుంచి దాదాపు 30 మోటర్ల వరకు కేబుల్స్ కట్ చేసి అక్కడే మెల్ట్ చేసుకుని తీసుకుని వెళ్ళిపోతున్నారు. అలాగే గత రాత్రి ఎదురుమెట్ట దగ్గర రెండుట్రాన్స్ఫార్మర్లు ఊడదీసి ట్రాన్స్ఫా ర్మర్ లో ఉన్న కేబుల్స్ తీసుకుని వెళ్ళి పోయారు. రైతులు గత 20 రోజుల నుంచి వాళ్ళని



పట్టు కోవటానికి ట్రై చేస్తున్నారు. మరియు కంప్లైంట్లు కూడా రెండు మూడు సార్లు ఇవ్వడం జరిగింది. కానీ ఎవరి త్రీ దేస్ కి ఫోర్ దేస్ కి కంప ల్సరిగా ఏదో ఒక చోట కేబుల్స్ కట్ చేయడం ట్రాన్స్ఫార్మర్లు తీసేయడం జరుగుతుంది.. దీని మీద సరైన యాక్షన్ తీసుకోవాలని రైతులు కోరుతు న్నారు..రైతులందరూ తరపున అలాగే కోకో గింజల అలాగే విరివిగా దొంగత నాలు మేకలు,గొర్రెలను కూడా దొంగ తనాలు చేస్తున్నారు. దీనిమీద తగు చర్యలు తీసుకోవాలని, రైతులు గ్రామ ప్రజలు. పోలీస్ డిపార్ట్మెంట్ వారిని కోరుతు న్నారు.



గతంలో ఈ ప్రాంతంలో ఇదే విధంగా అనేక దొంగతనాలు జరిగాయి వారిని పట్టుకుని జైలు పాలు చేశారు. గత పుష్కరకాలం నుండి స్టడీస్ ఎప్పుడు లేదు. ఈ ఏడాది వ్యవసాయ పనులు ప్రారంభంతో వరుస దొంగతనాలతో రైతులు బేజారు ఎత్తుతున్నారు. ఏది ఏమైనా పోలీసులు దొంగలను పట్టుకుని వ్యవసాయ పనులకు సహకరించాలని మెట్ట ప్రాంతపు రైతులు కోరుతున్నారు.

# పారిశుద్ధ్యంలో ఏలూరు జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలపాలి

**సింగల్ యూజ్ ప్లాస్టిక్ కి ప్రత్యామ్నాయంగా గుడ్డ సంచులు, స్టీల్ గ్లాసులు వంటి వాటి వినియోగం పెరగాలి- జిల్లా కె. వెట్రిసెల్వి**

ప్రజాభూమి ఉంగుటూరు/ఏలూరు ప్రతినిధి

..ఏలూరు జిల్లాను రాష్ట్రంలోనే స్వచ్ఛ ఏలూరుగా ప్రథమ స్థానంలో నిలిపేందుకు సమాజంలోని అన్ని వర్గాల ప్రజల సహకరించాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. ఉంగుటూరు మండలం చేబ్రోలులోని చెత్త నుండి సంపద సృష్టి కేంద్రంలో శనివారం స్వర్ణ ఆంధ్ర.స్వచ్ఛ ఆంధ్ర..కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజుతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజలతో గ్రామాలను పరిశుద్ధ్యంగా ఉంచుతామని, సింగల్ యూజ్ ప్లాస్టిక్ ను నిషేధిస్తామని ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా కాఫీ విత్ క్లాప్ మిత్రాస్' కార్యక్రమంలో క్లాప్ మిత్రలతో కాఫీ తాగారు. క్లాప్ మిత్రలను ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిదిగా పాల్గొన్న కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ సంపూర్ణ పారిశుద్ధ్యం,ప్లాస్టిక్ వినియోగం నిషేధంపై ప్రభుత్వం ఎన్ని కార్యక్రమాలు నిర్వహించినా ప్రజలు అది చేతల్లో చూపినప్పుడే



సాధ్యమవుతుందన్నారు. స్వచ్ఛ ఏలూరు జిల్లాను రూపొందించడానికి, ప్లాస్టిక్ వినియోగం ముఖ్యంగా సింగల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై నిషేధం పూర్తి స్థాయిలో అమలు సంకల్పంముందుగా ప్రతీ ఇంటినుండి మొదలవ్వాలన్నారు. స్పూన్లు, కంటైనర్ల, జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలలో ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేదించామన్నారు.


**చేబ్రోలు గ్రామాన్ని దత్తత్త తీసుకుంటా:**

కలెక్టర్ చేబ్రోలు గ్రామాన్ని తాను దత్తత తీసుకుంటు న్నాని, గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి దేశంలోని ఉత్తమ గ్రామంగా తీర్చిదిద్దుతానని కలెక్టర్ చెప్పారు. చేబ్రోలు గ్రామానికి అవసరమైన మౌలిక సదుపాయాలు అన్ని కల్పిస్తానన్నారు.ఉంగుటూరు శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజు మాట్లాడుతూ చేబ్రోలు గ్రామం జాతీయ స్థాయిలో ఉత్తమ పారిశుద్ధ్య గ్రామంగా అవార్డు అందుకోవడం అభినందించదగిన విషయమన్నారు. జిల్లా పంచాయతీ అధికారి కె. అనురాధ మాట్లాడుతూ చేబ్రోలు లో సింగల్ యూజ్ ప్లాస్టిక్ ను నిషేధించడం జరిగిందని, ఉపయోగించే ప్రజలపై 500 రూపాయలు జరిమానా, వాణిజ్య సముదాయాలపై 1000 రూపాయలు జరిమానా విధించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా గాంధీజీ విగ్రహానికి జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, పూలమాల వేసి నివాళులు అర్పించారు.అనంతరం చెత్త నుండి సంపద కేంద్రంలో కలెక్టర్, ఎమ్మెల్యే మొక్కలను నాటారు.అనంతరం కంపోస్ట్ ఎరువుల తయారీని కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ని, ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజుని దుశ్శాలువాతో సత్కరించారు.కార్యక్రమంలో తహసీల్దార్ పూర్ణ ప్రసాద్, ఎంపిడిఓ , పంచాయతీ సర్పంచ్ శ్రీనివాస్,సర్పంచ్ లక్ష్మి సునీత,ఉప సర్పంచ్ దుర్గ భవాని, పాల్గొన్నారు.

# విద్యార్థిని విద్యార్థులకు ప్లాస్టిక్ వాడకం పై అవగాహన కార్యక్రమం కరస్పాండెంట్ రాంబాబు

ప్రజాభూమి, కామవరపుకోట

ఏలూరు జిల్లా కామవరపు కోట మండలం స్థానిక తడికలపూడి జీసస్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నందు విద్యార్థులకు ప్లాస్టిక్ వాడకంపై అవగాహన కల్పిస్తూ, ప్లాస్టిక్ వాడరాదని, వాడటం వలన లాభాలు, నష్టాలు, విద్యార్థులకు అర్థమయ్యేలా కళాశాల కరస్పాండెంట్ రాంబాబు తెలియజేశారు. అలానే విద్యార్థులు ఏ విధంగా చదవాలో భవిష్యత్తులో ఒక ఉన్నతమైన స్థాయిలో ఉండానికి ఏ విధంగా కృషిచేయాలో విద్యార్థులకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ రాంబాబు , ప్రిన్సిపల్ యోహాన్ బాబు , మణికుమార్ , ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



# జగ్గంపేట డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ గా జీవి లలిత కుమారి

ప్రజా భూమి జగ్గంపేట

జగ్గంపేట అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ గా జీవి లలిత కుమారి శనివారం బాధ్యతలు చేపట్టారు గతంలో ఈమె రాజమండ్రి గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ గా పనిచేసినట్టు ఆమె తెలిపారు ఇప్పటివరకు ప్రిన్సిపల్ ఇంచార్జిగా రాజకుమారి చొల్లంగి బదిలీ అయ్యారు ఈ సందర్భంగా డాక్టర్ లలిత కుమారి మాట్లాడుతూ విద్యార్థులను తీర్చిదిద్దడంలో నా వంతు పాత్ర పోషిస్తానని వారికి ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసుకుంటానన్నారు వసతి గృహంలో ఉన్న విద్యార్థులకు మంచి పోషకాహారం వారి యొక్క ఆరోగ్య సమస్యలను దృష్టిలో పెట్టుకుని విద్యావంతులుగా తీర్చిదిద్దుతానని ఆమె అన్నారు పాఠశాలలో విద్యను బోధిస్తున్న



ఉపాధ్యాయులు బాధ్యతలు చేపట్టిన ప్రిన్సిపాల్ కు పూల గుచ్ఛంతో స్వాగతం పలికారు'

# సమస్యల వలయంలో పోలవరం పునరావాస కాలనీల ప్రజలు.



ప్రజాభూమి, వి.ఆర్.పురం.

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో నిర్వాసితులవుతున్న ప్రజలకు ఇచ్చినటువంటి పునరావాస కాలనీలోని ప్రజలు, పలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి అని సి.పి.యం జిల్లా కమిటీ సభ్యులు, మండల సిపిఎం పార్టీ కార్యదర్శి పులి సంతోష్ కుమార్ ఆరోపించారు. పునరావాస ముంపు గ్రామాల పేరుతో కాలనీలకు వెళ్లినటువంటి నిర్వాసితులకు ప్రభుత్వం సరైన మౌలిక సదుపాయాలు కల్పించకపోవడం వలన తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పునరావాస కాలనీలలో ఉంటున్న బాధితుల అభ్యర్థన మేరకు సిపిఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో కాపవరం, కన్నాయి గూడెం, రామ్ గోపాలపురం పునరావాస కాలనీలలో బాధితులను కలిసి వారి బాధలు తెలుసుకొని కాలనీలు అంతట కలియ తిరుగుతూ వారు చెప్పినటువంటి సమస్యలను పరిశీలించారు. మండల పరిధిలోని దాదాపు 19 గ్రామాలు పోలవరం మొదటి కాంటూరులో ముంపునకు గురవుతున్నాయి, కొల్లూరు గొందూరు, కొటారుగొమ్ము, శ్రీరామగిరి గ్రామాల నిర్వాసితులకు నెల్లిపాక దగ్గరలో గల రామ్ గోపాల్ పురంలో, తుష్టివారి గూడెం వారికి కాపవరంలో, ములకపల్లి, కల్తునూరు, ఇప్పురు, గ్రామాల వారికి కన్నాయిగూడెంలో, ఇసునూరు, రాయిగూడెం వారికి విస్సాపురం, జీడిగుప్ప వారికి కూనవరం మండలం భైరవపట్నంలో పునరావాస కాలనీలు గత ఎనిమిది సంవత్సరాల క్రితం నిర్మించడం జరిగిందనీ, ఈ ప్రాంతంలో గోదావరి వరదలు తట్టుకోలేక చాలా కుటుంబాల నిర్వాసితులు తమ తమ పునరావాస కాలనీలోని ఇళ్లకు వెళ్లి నివసిస్తున్నారని, కానీ వారి పరిస్థితి



దారుణంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా కాలనీలో నివాసం ఉంటున్నటువంటి కుటుంబాల వారు సిపిఎం పార్టీ బృందంతో మాట్లాడుతూ కాలనీలలోని వీధులన్నీ రోడ్ల నిర్మాణం కాక బురదమయం అయ్యి ఉన్నాయని. అంగన్వాడి మరియు పాఠశాల భవనాలు నిర్మాణం పూర్తీ కాక కాలనీలలో ఉంటున్నటువంటి పిల్లలందరూ వేరే గ్రామాలకు వెళ్లి చదువుకోవడం తప్పడం లేదని, మా గ్రామాల నిర్వాసితులందరికీ భూమికి భూమి చూపించారు కానీ అట్టి భూమిలో వ్యవసాయం చేయడానికి వీలు లేకుండా జామాయిల్ మోళ్లతో దర్శనమిస్తున్నాయని, ప్రతి నెల పెన్షన్ కోసం మరియు రేషన్ బియ్యం కోసం విడిచిపెట్టి వెళ్లిన జన్మస్థానాలు అయిన గ్రామాలకు వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తుందని, పేరుకే ఫ్రీ బియ్యం కానీ వాటిని తెచ్చుకోవడానికి రోజంతా ప్రయాణం దాదాపు 250 రూపాయలు చార్జీల రూపంలో భారం అవుతున్నాయని తెలిపారు. మీ నిర్వాసిత కాలనీల విషయంపై త్వరలోనే జిల్లా కలెక్టర్ మరియు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వారిని కలిసి తమ సమస్యలను వివరిస్తామని ప్రభుత్వం ద్వారా నిర్వాసిత కాలనీలో చట్ట ప్రకారం కల్పించే అన్ని రకాల మౌలిక సదుపాయాల కొరకు పోరాడతామని నిర్వాసితులకు సిపిఎం బృందం తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ కారం లక్ష్మి, సర్పంచ్ వెట్టి లక్ష్మి, మండల నాయకులు పంకు.సత్తిబాబు, కారం.సుందరయ్య, పోడియం శ్రీరామమూర్తి, గుండుపూడి లక్ష్మణరావు , శిరపు తాతబాబు, కుంజా కన్నయ్య, ఆత్మకూరి కాంతారావు, సిహెచ్ సుబ్బారావు, నిర్వాసిత కాలనీలలోని పెద్దలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభూమి



## విద్యుత్ శాఖ అధికారుల సమీక్ష సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ



ప్రజా భూమి ప్రతినిధి ప్రత్తిపాడు

ప్రత్తిపాడు మండలం పెద శంకర్లపూడి లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజవర్గానికి చెందిన శంఖవరం రౌతులపూడి ఏలేశ్వరం ప్రత్తిపాడు విద్యుత్ శాఖ అధికారులతో శనివారం సమీక్షా సమావేశం ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ రాజా అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో నియోజకవర్గం లోని పలు గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యల గురించి, అందుకు తీసుకోవలసిన చర్యల గూర్చి చర్చించడమైనది. ఈ నియోజకవర్గం లోని అనేక గ్రామాలలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, రాబోయే వర్షాకాలం లో ప్రజలకు ఎటువంటి విద్యుత్ సమస్యలు రాకుండా చూడాలని అధికారులను ఆమె ఆదేశించారు. ఈ సమావేశంలో కాకినాడ జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్ .ఈ ), ఏ .డి .ఈ జగ్గంపేట మరియు ప్రత్తిపాడు నియోజకవర్గం లోని నాలుగు మండలాల ఏ ఈ లు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ రాజాకి తూర్పులక్ష్మీపురం గ్రామస్థులు ధన్యవాదములు



ప్రజా భూమి ప్రతినిధి ఏలేశ్వరం

గత 2024 నవంబర్ నెలలో అడ్డతీగల మండలం, తిమ్మాపురం వద్ద ఏలేరు నదిలోఏలేశ్వరం మండలం తూర్పు లక్ష్మి పురం గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు ఇసుక తవ్వకానికి వెళ్ళి ప్రమాదవశాత్తు ఉభి లోకి కూరుకొని మృత్యువాత పడ్డారు. వారి కుటుంబాలకు ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయం అందేలా ఎమ్మెల్యే సత్య ప్రభ తీవ్రంగా కృషి చేసి వారి కుటుంబాలకు అండ గా నిలిచారు. ఆ నాల్గురికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందే విధంగా చర్యలు చేపట్టి వారి కుటుంబలను ఆదుకున్నారు. ఈ సందర్భంగా ఆ గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు బూరెల బాస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ కి గ్రామస్తులు బాధిత కుటుంబాలు కృతజ్ఞతలు తెలియ జేసారు.

## :విజయనగరం జిల్లా మేరక ముడిద్దాం మండలం కి చెందిన బుధ రాయవలస గ్రామవాసి ఆచూకీ

ప్రజా భూమి ప్రతినిధి ఏలేశ్వరం




ఇంటి నుండి దూరమై కొన్ని నెలలుగా గడిచిన ఒక వ్యక్తి కాకినాడ జిల్లా, ప్రత్తిపాడు లో దీనస్థితిలో ఉన్నాడు. శనివారం స్వామి వివేకానంద ట్రస్ట్ ఆధ్వర్యంలో అతన్ని శుభ్రపరిచి మంచి బట్టలు తొలగించారు. స్వామి వివేకానంద ట్రస్ట్ అధ్యక్షులు మైరాల నాగేశ్వరరావు, అడపా సుబ్రహ్మణ్యం మరికొందరు పెద్దలు కలిసి ఆదరించి బాగు పరిచారు. తన పేరు సరిది అప్పలనాయుడు అడ్రస్ విజయనగరం జిల్లా, మెరకముడిదాం మండలం, బుదరాయవలస గ్రామం అన్నట్లుగా నెమ్మదిగా చెబుతున్నాడు. తన అన్నయ్య పేరు సరిది పాపి నాయుడు అని, తమ గ్రామ పెద్ద రెండ సూరి నాయుడు అన్నట్లు గా చెప్పాడు. ఇతన్ని తమ సొంత ఇంటికి చేరేలా ఈ సమాచారాన్ని విజయనగరం జిల్లా వారికి షేర్ చేసి ఈ క్రింది ఫోన్ నెంబర్ కు సంప్రదించవలసిందిగా వారి సందర్భంగా తెలిపారు. 7396443227 (నాగు ఫ్రొం ఎర్రవరం )కు ఫోన్ చెయమనండి. అలాగే స్థానిక పోలీస్ స్టేషన్లో కూడా ఇతను ఆచూకీ గురించి వివరిస్తే పోలీసుల సహాయంతో వారి సొంత ఇంటికి అతన్ని చేర్చే ఏర్పాటు చేయగలరని వారీ సందర్భంగా వెల్లడించారు.

## శాకంబరీ దేవిగా దర్శనమిచ్చిన పాదాలమ్మ తల్లి.....పోటెత్తిన భక్తులు

ప్రజాభూమి రౌతులపూడి



రౌతులపూడి మండలం లోని శృంగవరం లో వేంచేసి ఉన్న పాదాలమ్మ తల్లి పండుగను ఆషాడ మాసంలో ప్రతి ఏడాది గ్రామ దేవత పాదాలమ్మ తల్లి భావించి పండుగను ఘనంగా నిర్వహిస్తారు. శనివారం జాతర మహోత్సవంలో భాగంగా గ్రామస్తులు మంగళ వాయిద్యాలు, బాణ సంచాలతో అంగరంగ వైభవంగా బోనాలు సమర్పించారు. అమ్మవారిని శాకంబరీ దేవిగా అలంకరించారు. శనివారం శాకంబరీ దేవి అవతారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. భక్తులు భారీ స్థాయిలో పాల్గొని పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు.

## ఘనంగా జనసేన జగ్గంపేట నియోజకవర్గ ఇన్చార్జి తుమ్మలపల్లి రమేష్ జన్మదిన వేడుకలు

ప్రజా భూమి జగ్గంపేట



జగ్గంపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జి తుమ్మలపల్లి రమేష్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. తుమ్మలపల్లి రమేష్ జన్మదిన పురస్కరించుకుని శనివారం కిర్లంపూడి మండలం రామచంద్రపురం గ్రామంలోని రమేష్ స్వగృహం నందు ఈ జనసేన పార్టీ అభిమానులు కార్యకర్తల మధ్య భారీ కేకులనుకట్ చేసి జన్మదిన వేడుకలు వైభవంగా జరిగాయి..ఈ కార్యక్రమంలో నియోజకవర్గం నలుమూలల నుంచి జనసేన పార్టీ, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, తుమ్మలపల్లి శేఖర్, రమేష్, చందు అభిమానులు పెద్ద ఎత్తున హాజరై తుమ్మలపల్లి రమేష్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు..పలువురు అభిమానులు పుస్తకాలు పెన్నులు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. మరి కొంతమంది పూల బొకేలు గజమాలు, శాలువాలతో తో సత్కరించి, వారి వెంట తీసుకువచ్చిన కేకులను కట్ చేసి రమేష్ జన్మదిన వేడుకల్లో పాలుపంచుకున్నారు.. వారి జన్మదినం సందర్భంగా తుమ్మలపల్లి రమేష్ రామచంద్రపురం గ్రామంలో మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరడం జరిగింది అలాగే ప్రతి ఒక్కరు పుట్టినరోజులకు శుభకార్యాలకు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యులు కావాలని అన్నారు వచ్చిన ప్రతి ఒక్కరికి రమేష్ స్వగృహం నందు భోజనాలు ఏర్పాటు చేశారు..ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## గంజాయి విక్రయిస్తున్న ముఠా అరెస్టు

ప్రజాభూమి అమలాపురం



అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ని మామిడికుదురు వద్దనగరం గ్రామంలో గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు శనివారం పోలీసులు దాడి చేశారు. మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ నీతిపూడి గణపతి రావు సమాది వద్ద యువకులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 950 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై ఎచైతన్యకుమార్ తెలిపారు. ఈ కేసులో యానాంకు చెందిన కనపర్తి వెంకట దుర్గ పెద్దిరెడ్డి గోవిందరాజు పల్లం గ్రామానికి చెందిన పెమ్మాడి నాగూర్ పుచ్చల్లంకకు చెందిన ఎన్నాబత్తుల వెంకట్ ను అరెస్టు చేశామన్నారు. వీరిని రిమాండ్ కొరకు రాజోలు కోర్టుకు తరలించామన్నారు.

## వైభవంగా వీరవరం సొసైటీ నూతన అధ్యక్షుడు తోట గాంధీ ప్రమాణ స్వీకార మహోత్సవం

### ఆశీస్సులు అందించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ,డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు

ప్రజా భూమి కిర్లంపూడి





కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం వీరవరం గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ అధ్యక్షుడిగా తోట గాంధీ,సభ్యులుగా నామసాని త్రానం, మండంగల సూర్యనారాయణ బాధ్యతలు శనివారం స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ,డిసిసిబి చైర్మన్ తుమ్మల బాబు,జనసేన ఇంచార్జి తుమ్మలపల్లి రమేష్,కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్, ఏలేరు ప్రాజెక్ట్ చైర్మన్ బస్వా వీరబాబు,సీనియర్ నాయకుడు భూపాలపట్నం ప్రసాద్ తదితరులు హాజరయ్యారు.అనంతరం ఎంపీపీ తోట రవి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ముఖ్య అతిధులు మాట్లాడుతూ పరపతి సంఘ కార్యకలాపాలను పారదర్శకంగా, రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని నూతన పాలకవర్గం పని చేయాలని విలువనిచ్చారు. ఈ సందర్భంగా నూతన సొసైటీ అధ్యక్షుడు తోట గాంధీ మాట్లాడుతూ ఈ అవకాశం కల్పించిన స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూతో పాటు కూటమి నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా గాంధీని పలువురు నాయకులు పూలమాలలు వేసి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అడపా భరత్ బాబు,ఎస్వీఎస్ అప్పలరాజు,మండల పార్టీ అధ్యక్షుడు చదరం చంటిబాబు కూటమి నాయకులు వీరంరెడ్డి కాశీబాబు,గుడాల రాంబాబు,తూము కుమార్,పట్టి చంటిబాబు,గరగ గోవింద్,అల్లు శివరామకృష్ణ,తోట విష్ణు మూర్తి,కంటా శ్రీను,నంది బాలకృష్ణ,ఎరికిరెడ్డి బాబ్జి,గోడే బాల,ఉలిసి అయిరాజ్,గంధం ప్రభాకర్,గోకేడ రాజా,అరిణే రాజేష్,స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై నూతన పాలకవర్గానికి అభినందనలు తెలిపారు.

## యర్రవరంలో ఆర్టికల్చర్ కలెక్షన్ సెంటర్న్ని పరిశీలించిన జాయింట్ ఎంక్వైరీ కమిటీ

### జిల్లా ఆర్టికల్చర్ అధికారి జి విజయలక్ష్మి మండల ఆర్టికల్చర్ అధికారి కే దివ్యశ్రీ

ప్రజా భూమి ప్రతినిధి ఏలేశ్వరం



ఏలేశ్వరం మండలం లోని యర్రవరం గ్రామంలో అభి ఆంజనేయ ఉద్యాన ఉత్పత్తిదారుల రైతు సహకార సంఘం వారిచే నూతనంగా నిర్మించిన కలెక్షన్ సెంటర్ ను జాయింట్ ఎంక్వయిరీ కమిటీ శనివారం పరిశీలించింది.జిల్లా హార్టికల్చర్ అధికారిణి జి విజయలక్ష్మి ఏలేశ్వరం మండలం హార్టికల్చర్ అధికారి కే దివ్యశ్రీ,ఇంజనీరింగ్ అసిస్టెంట్ హరికృష్ణ,రైతు సంఘం సీఈవో నీరుకొండ సత్యనారాయణ ఆధ్వర్యంలో కలెక్షన్ సెంటర్ ను పరిశీలించారు.ఈ సందర్భంగా రైతు సంఘ సభ్యులతో అదికారులు సమావేశమయ్యారు.కలెక్షన్ సెంటర్ నిర్మాణం పై సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రారంభం తర్వాత దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ బీసెట్టి అప్పలరాజు, జడ్పిటిసి నీరుకొండ రామకుమారి, అభయాంజనేయ రైతు సంఘ అధ్యక్షులు నీరుకొండ సత్యనారాయణ,బీశెట్టి ప్రసాద్, గుల్లంపూడి గంగాధర్,నీరుకొండ అర్జున్,దాసరి రమేష్,తోట గంగాధర్,కేలంగి వీరబాబు,తోట నాగయ్య,సేనాపతి జగదీష్, హార్టికల్చర్ అధికారులు నానిబాబు, పుష్ప , సువర్ణ, మనోజ్,నిఖిల్,ఇంజనీరింగ్ అసిస్టెంట్ హరి కృష్ణ,పలువురు రైతులు పాల్గొన్నారు.

## తాము చదువుకున్న తరగతి గదిని ఆధునికరించడం అభినందనీయం...

### పూర్వ విద్యార్థుల సొంత నిధులతో ఆధునికరించిన తరగతి గది ని ప్రారంభించిన... ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ రాజా.

ప్రజా భూమి ప్రతినిధి ప్రత్తిపాడు






ప్రత్తిపాడు హై స్కూల్ కి చెందిన పూర్వపు విద్యార్థులు వారి సొంత నిధులతో ఆధునీకరణ చేసిన తరగతి గదిని ఎమ్మెల్యే సత్య ప్రభ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రత్తిపాడు హై స్కూల్ 2003-2004 లో పదవ తరగతి చదువుకొన్న పూర్వ విద్యార్థులు వారి తరగతి గదిని 80 వేల రూపాయలతో ఆధునీకరణ చేయడం అభినందనీయం అన్నారు. పాఠశాల తరగతి గది కి రంగులు , టైల్స్, ఫాన్స్ వేయించి అందంగా, సౌకర్య వంతంగా తీర్చి దిద్దిన పూర్వపు విద్యార్థులు అభినందనీయులు అన్నారు . ఇరవై సంవత్సరాలు క్రిందట చదువుకొన్న, తరగతి గదిని,పాఠశాలను, విద్య బుద్ధులు నేర్పిన గురువులను గుర్తుంచుకోవడం గొప్ప విషయం అని అన్నారు. వారి అందరినీ అభినందిస్తున్నాను తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు, వారి గురువులను ఎమ్మెల్యే చేతులమీదుగా చిరు సత్కారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ ను నిషేధిద్దాం. పర్యావరణాన్ని కాపాడుదాం.. రాజపూడి సర్పంచ్ బుసాల విష్ణు మూర్తి

ప్రజా భూమి జగ్గంపేట



జగ్గంపేట మండలం రాజపూడి గ్రామంలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ ప్రతి మూడవ శనివారం స్వచ్ఛంద స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం రాజపూడి సర్పంచ్ బుసాల విష్ణుమూర్తి ఆధ్వర్యంలో జగ్గంపేటశాసనసభ్యులుజ్యోతుల నెహ్రూ ఆదేశాలతో పంచాయతీ కార్యదర్శి మూర్తి నిర్వహించిన ఈ కార్యక్రమానికి జగ్గంపేట మండల అభివృద్ధి అధికారి ఏవీఎస్ చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గ్రామంలో పారిశుభ్రత గురించి తడి చెత్త,పొడి చెత్త విడివిడిగా వేయాలని, ఒకసారి వినియోగించే ప్లాస్టిక్ ను ఉపయోగించరాదని ప్లాస్టిక్ కవర్లు ప్లాస్టిక్ గ్లాసులు. నిషేధించడం జరిగిందని గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రచారం కార్యక్రమం చేయడం జరిగిందని ప్లాస్టిక్ నిషేధించి పర్యావరణాన్ని కాపాడదామని రాజపూడి సర్పంచ్ విష్ణుమూర్తి అన్నారు. అనంతరం స్కూల్లో విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని అధికారులు, నాయకులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాజపూడి సొసైటీ చైర్మన్ ఉప్పలపాటి బుల్లె బ్బి, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి రేఖ బుల్లి రాజు, గ్రామ టిడిపి అధ్యక్షులు గనిశెట్టి సన్యాసిరావు, బత్తుల వెంకన్న రాజపూడి సచివాలయ సిబ్బంది అంగన్వాడి వర్కర్లు, ఆశ వర్కర్లు అధిక సంఖ్యలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

## వాడపల్లిలో భక్తుల కోసం దేవస్థానం చేసిన ఏర్పాట్లు పరిశీలించిన కొత్త పేట ఎమ్మెల్యే బండారు సత్యనందరావు

ప్రజా భూమి వాడపల్లి



కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని దేవస్థానం చేసిన ఏర్పాట్లను ఎమ్మెల్యే బండారు సత్యానందరావు శనివారం ఆలయ అధికారులతో కలిసి పరిశీలించారు. క్యూ లైన్ల ఏర్పాటు, తాగునీటి సౌకర్యం, చిన్నపిల్లలకు పాలు, బిస్కెట్ ప్యాకెట్ల సరఫరా తదితర అంశాలను ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావును అడిగి తెలుసుకున్నారు. క్యూలైన్ల లోని భక్తులకు సౌకర్యవంతంగా ఉండేలా మరిన్ని కూలర్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని, మాడవీధుల బయట తాత్కాలిక క్యూలైన్లలో భక్తులకు ఎండ తగలకుండా మరిన్ని టెంట్లు ఏర్పాటు చేయాలని, భక్తులు వేచి ఉండే సమయంలో అనారోగ్య సమస్యలు ఏర్పడితే వారికి మెరుగైన వైద్యం అందించేలా ఆరోగ్య సిబ్బందిని మరింత మందిని పెంచాలని డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావును ఎమ్మెల్యే ఆదేశించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా స్వామివారి దర్శనం కలిగేలా చూడాలని ఎమ్మెల్యే ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

## ప్లాస్టిక్ భూతాన్ని కలిసికట్టుగా తరిమికొడదాం జిల్లా పంచాయతీ అధికారి శాంతామణి

ప్రజా భూమి ప్రతినిధి కడియం





పర్యావరణానికి పెను ముప్పుగా మారిన ప్లాస్టిక్ భూతాన్ని కలిసి కట్టుగా తరిమి కొడదామని తూర్పుగోదావరి జిల్లా పంచాయతీ అధికారి శాంతామణి పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెల మూడో శనివారం స్వచ్చాంద్రా స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పలు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలను రూపొందించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా ఈ శనివారం ప్లాస్టిక్(ఒక్కసారి వాడి పడేసే)నిషేధంకు సంబంధించి ఆయా గ్రామపంచాయతీ కార్యాలయా వద్ద గ్రామసభ నిర్వహించారు. కడియం మండలం వేమగిరి పంచాయతీ గ్రామ సభలో డిపిఓ శాంతామణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్లాస్టిక్ నిషేధంకు సంబంధించి జీవో నెంబర్ 81 అమలు చేయడానికి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టిందన్నారు. అందువల్ల ప్లాస్టిక్ విక్రయాలు ఎక్కడ చేపట్టినా కఠిన చర్యలు తీసుకోబడతాయన్నారు. పలు షాపుల వద్దకు వెళ్లి అక్కడ ప్లాస్టిక్ విక్రయాలుపై ఆమె ఆరా తీశారు. ఇకపై ప్లాస్టిక్ విక్రయాలు చేపడితే ప్రభుత్వం నిర్ణయించిన అధిక మొత్తంలో జరిమానా చెల్లించాల్సి ఉంటుందని వ్యాపారులకు ఆమె హెచ్చరించారు. గ్రామసభ అనంతరం వేమగిరి జంక్షన్ వరకు పాఠశాల విద్యార్థులు,ఉపాధ్యాయులు తో కలిసి ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ నిషేధం సంబంధించిన ప్లే కార్డులు ప్రదర్శించి,నినాదాలు చేసారు. అలాగే ప్రభుత్వం రూపొందించిన ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె. రమేష్, డిప్యూటీ ఎంపీడీవో ఎన్.శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి రూప్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.

## అమెరికన్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదాన వేడుకలకు ఆహ్వానం

### పోతన సాహిత్య పీఠం అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి శంకర్



ప్రజాభూమి ఒంటిమిట్ట:

అమెరికన్ విస్ డమ్ పీస్ విశ్వవిద్యాలయం 27 జూలై 2025 న వివిధ రంగాలలో ప్రతిభ కలిగిన వారికి గౌరవ డాక్టరేట్ మరియు జీవిత సాఫల్య పురస్కారాలు అందజేసే కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా ఒంటిమిట్ట పోతన సాహిత్య పీఠం అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి శంకర్ ను ఆహ్వానించింది పాండిచ్చేరి లోని హొటల్ అతిధి లో జరిగే ఈ కార్యక్రమము లో అమెరికన్ విస్ డమ్ పీస్ విశ్వవిద్యాలయానికి చెందిన పుస్తక ఆవిష్కరణ మరియు విభిన్న రంగాలలో ప్రతిభ కల వ్యక్తులకు గౌరవ డాక్టరేట్ పురస్కారాల ప్రధానము ఉంటుంది ఈ కార్యక్రమంలో పాండిచ్చేరి శాసనసభ స్పీకర్ ఎమ్ ఎల్ ఏ ఎంబలం సెల్వం, 5 సార్లు గిన్నిస్ ప్రపంచ రికార్డు సాధించిన డాక్టర్ కరాటే శ్రీనాథ్, కోయంబత్తూర్ కు చెందిన ఆల్ ఇండియా ఏంటి విండోడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ కతిర్వెల్, పాండిచ్చేరి కేంద్ర కారాగార పోలీస్ సూపరిండెంట్ భాస్కరన్, పాండిచ్చేరి నమ్మాళ్వార్ న్యాచురల్ ఫార్మర్స్ అసోసియేషన్ కో ప్రెసిడెంట్ రాజా వేణుగోపాల్, పాండిచ్చేరి ఠాగూర్ గవర్నమెంట్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలకు చెందిన రేఖా రాజా, దేవి ప్రియ,నారాయణస్వామి,విమల,విఘ్నేశ్వరన్,షణ్ముగప్రియ తదితరులు పాల్గొంటారని ఆహ్వాన పత్రంలో విశ్వవిద్యాలయం పేర్కొంది.

## ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిద్దాం ...వాతావరణ కాలుష్యాన్ని నివారిద్దాం

ప్రజాభూమి, పులివెందుల



పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాలలో స్వచ్ఛఆంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల జాతీయ సేవా పథకం కార్యక్రమ అధికారి డాక్టర్. జయమ్మ మాట్లాడు తూ ప్రతినెల మూడవ శనివారం ఈ స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం కళాశాల తరపున నిర్వహించడం జరుగుతుందని ఆమె తెలిపారు. ప్లాస్టిక్ వినియో గంతో వచ్చే అనర్థాలు, రోగాలు వివరించడంతో పాటు ప్లాస్టిక్ వస్తువులకు ప్రత్యామ్నాయాలపై అవగాహన కల్పించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను అంతమొందించేందుకు నేడు ఎండింగ్ ప్లాస్టిక్ పొల్యూషన్ అనే అంశం స్వచ్ఛ్ ఆంధ్ర కార్యక్రమం లో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిందని పేర్కొన్నా రు. ప్రతి ఒక్కరూ తమ రోజువారి పనులలో ప్లాస్టిక్ వస్తువుల వినియోగం నిషేధించాలని అన్నారు. ఈ సందర్భంగా కళాశాల ఎన్.ఎస్.ఎస్ విద్యార్థి వాలం టీర్లు కళాశాల ప్రధాన భవనం వెనుక భాగంలో ఉన్న ప్లాస్టిక్ కవర్లు , ఇతర ప్లాస్టిక్ వ్యర్థాలను, చెత్త చెదారాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో ఇంజినీర్ నజ్మా, అధ్యాపకుడు డాక్టర్ జాకిర్ భాషా, పి.డి డాక్టర్ రాజశేఖర్, కళాశాల ఎన్.ఎస్.ఎస్ విద్యార్థి వాలంటీర్లు పాల్గొన్నారు.

## కేరళ నుండి కాశ్మీర్ కు సైకిల్ యాత్ర

ప్రజాభూమి, పులివెందుల



కొట్టాయం జిల్లా , అతిరంపుర గ్రామం నుండి జోపన్ అనే వ్యక్తి తన స్వగ్రామం నుండి కాశ్మీర్ వరకు సైకిల్ యాత్ర చేపట్టాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 11, 2024 సంవత్స రంలో సైకిల్ యాత్ర మొదలుపెట్టి జూలై 19 తేదీ నాటికి పులివెందుల చేరుకున్నాడు. దాదాపు తొమ్మిది నెలలు పులివెందుల చేరుకునేందుకు పట్టిందని తెలిపారు. కాశ్మీర్ చేరుకునేందుకు దాదాపు రెండున్నర సంవత్సరం పడుతుందని ఆయన తెలిపారు. రోజుకు50 నుండి 60 కిలోమీ టర్లు ప్రయాణం చేస్తా అన్నారు. ఆయనతోపాటు తన పెంపుడు కుక్క కూడా సైకిల్ వెంబడి ప్రయా ణం చేస్తుందన్నాడు .ఈ సైకిల్ యాత్ర పులివెందుల చేరుకోగానే పులివెందుల ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలికారు.పులివెందుల హరి యూట్యూ బ్ ఛానల్ వ్యక్తులు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు అన్ని సౌకర్యాలు వారు కల్పించారు. దీంతో ఆయన పులివెందుల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

## ముస్లింల వక్త బోర్డు ఆస్తుల పరిరక్షణ ధ్యేయంగా ఇన్సాబ్

### ఏరియా సహాయ కార్యదర్శి పిడుగు మస్తాన్

ప్రజాభూమి పోరుమామిళ్ల :



ముస్లిం సోదరుల పై కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు సవతి ప్రేమ చూపించడం సరైన పద్ధతి కాదు సిపిఐ ఏరియా సహాయ కార్యదర్శి పిడుగు మస్తాన్ సిపిఐ మండల కార్యదర్శి రవికుమార్ ప్రభుత్వాలపై మండి పడ్డారు ఈ సందర్భంగా పోరుమామిళ్ల పట్టణంలోని ఇన్సాబ్ ఆఫీస్ ఆవరణంలో ఫిరోజ్ అధ్యక్షతన శనివారం సమావేశం జరిగినది అనంతరం వారు మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి రావడంతో కులాలకు, మతాలకు, ప్రాంతాలకు చిచ్చు పెట్టడం ముస్లింలను ఇబ్బంది పెట్టి సవతి ప్రేమ వల్లే చూపిస్తున్నారని వారన్నారు అలాగే కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు వక్త బోర్డు ఆస్తులపై కాజేసీ ,ముస్లింలకు ఆదాయాన్ని చేకూరుస్తున్న ఆస్తులు గనుక వాటిని ఏదో విధంగా లేకుండా చేయాలన్న తీరు మార్చుకోవాలని వారన్నారు, దుల్హన్ పథకాన్ని అమలులో చేయడంలో చిత్తశుద్ధితో కేంద్ర ప్రభుత్వం వ్యవహరించడం , అన్నారు . పట్టణంలో ఒక ఒక ఇంటిలో రెండు మూడు కుటుంబాలు జీవనాలు సాగిస్తున్నాయి వారికి ఇంటి పట్టాలు మంజూరు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు, ఎస్సీ ఎస్టీ బీసీల వలే ముస్లిమ్స్ కూడా 300 యూనిట్లు విద్యుత్తు ఉచితంగా ఇవ్వాలని వారు అన్నారు ఎలాంటి షూరిటీ లేకుండా బ్యాంకు నుండి ప్రతి వ్యాపారస్తునికి రెండు లక్షల వరకు రుణాలు అందించి వారు చేస్తున్న పని ప్రోత్సాహానికి ఆర్థికంగా సహాయం అందించాలని వారు కోరారు .కార్యక్రమంలో ఇన్ సబ్ జిల్లా నాయకులు ఇస్మాయిల్, మండల నాయకులు ఫిరోజ్, సఫా, చాంద్ భాషా, వీరవల్లి, రఫీ, హుస్సేన్, ఫారుక్, అబ్దుల్లా, మహబూబ్ బాషా, మౌలాలి, మధు, వీరయ్య, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేద్దాం.

### పోరుమామిళ్ల మేజర్ సర్పంచ్ యనమల సుధాకర్

ప్రజాభూమి పోరుమామిళ్ల :



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే స్వర్ణాంధ్రు- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతినెల మూడవ శనివారం నిర్వహించే ఈ కార్యక్రమాన్ని పోరుమామిళ్ల పట్టణ పంచాయతీ కార్యాలయ ఆవరణంలో పోరుమామిళ్ల పట్టణ మేజర్ పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్స్, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొని పట్టణంలో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సర్పంచ్ యనమల సుధాకర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్రు-స్వచ్ఛ్ ఆంధ్ర అనే కార్యక్రమం రాష్ట్ర ఆర్థిక అభివృద్ధిని, పర్యావరణ పరిశుభ్రతను సాధించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిందని, వ్యక్త పదార్థాలు నిర్వహణను మెరుగుపరచడం, పర్యావరణాన్ని పరిరక్షే విధంగా ఈ కార్యక్రమాన్ని ప్రతినెల మూడో శనివారం నిర్వహించు కుంటున్నామన్నారు. అలాగే పట్టణంలో ప్లాస్టిక్ కాలుష్య నిర్మూలనకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈవో ఓబులేష్, పారిశుద్ధ్య కార్మికులు, విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు, అంగన్వాడి టీచర్స్ పాల్గొన్నారు.

## రెడ్లపై కక్ష సాధింపు సాధిస్తున్న కూటమి ప్రభుత్వం : రెడ్ల సామాజిక వర్గం జోలికొస్తే ఖబర్దార్

### రెడ్డి సంఘం నాయకులు సురేంద్రరెడ్డి, సర్వోత్తమ్ రెడ్డి

ప్రజాభూమి, పులివెందుల



కూటమి ప్రభుత్వ పాలనలో రెడ్డి సామాజిక వర్గాన్ని లక్ష్యంగా చేసుకొని పరుష పదజాలంతో దూషిస్తూ, కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని, రెడ్డి సామాజిక వర్గం జోలికొస్తే ఊరుకునే ప్రసక్తి లేదని రెడ్డి కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ నాయకులు సురేంద్ర రెడ్డి సర్వోత్తమ్ రెడ్డిలు కూటమి నాయకు లను హెచ్చరించారు. శనివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత 13 నెలలుగా కూటమి ప్రభుత్వం వచ్చి ఎటువంటి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేయకపోగా రాష్ట్రంలో ఉన్న రెడ్డి సామాజిక వర్గాన్ని లక్ష్యంగా చేసుకొని రెడ్డి సామా జిక వర్గానికి చెందిన సభ్యుల మనో భావాలు దెబ్బతినే విధంగా పరుష పదజాలంతో రెడ్లను తిడుతూ కక్ష సాధింపులకు పాల్పడుతున్నా రని వారు తీవ్రంగా ఖండించారు.రెడ్డి జాతికి సంబంధిం చిన మాజీ మంత్రి రోజా సెల్వమణి ని కూటమి ప్రభుత్వ నాయకుడు నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ విచక్షణ కోల్పోయి ఒక మహిళ అని చూడకుండా రోజా సెల్వమణి ని వ్యాంపు కు ఎక్కువ,హీరోయిన్ కి తక్కువ అని సంబోధిస్తూ మాట్లాడడం బాధాకరమన్నారు. ప్రభుత్వ అవినీతిని ప్రశ్నిస్తే కేసులతో, ఇళ్ల మీద దాడి చేస్తూ, అక్రమ కేసులు బనాయిస్తూ ఉంటే మా పరిస్థితి ఎలా ఉంటుంది అని వారు ప్రశ్నించా రు. కూటమి ప్రభుత్వం ఎల్లకాలం ఉండదని, రాబోయేది వైకాపా ప్రభుత్వమేనని, కూటమి నాయకుల పై ప్రతీకార చర్య తప్పదని హెచ్చరిం చారు.విష సంస్కృతిని రాష్ట్రంలో అవలంబిస్తున్నా రో అదే సంస్కృతిని రేపొద్దున వచ్చిన ఏ నాయకు డైనా మీ మీద ప్రయోగిస్తే మీ పరిస్థితి ఏంటి అనేది ఒక విషయం కూటమి నాయకులు ఆలోచించుకో వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రెడ్డి సామాజిక వర్గం రెడ్డిజాతి చాలా గౌరవప్రదం గా,సభ్యసమాజం లో గౌరవ మర్యాదలతో ప్రతి ఒక్కరిని మన అనుకొని చూసుకునే ఒక రెడ్డి జాతి సభ్యులని ఉద్దేశించి మీ మంది మార్బలం చేస్తున్న ఈ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టే రోజులు దగ్గర్లో ఉన్నాయన్నారు. రెడ్డి కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ తరఫున ప్రతి ఒక్క గ్రామానికి వెళ్లి రెడ్ల పై జరిగే దాడుల గురించి వివరిస్తామన్నారు.కూటమి ప్రభుత్వం ప్రజానీకానికి ఇచ్చిన వాగ్దానాలను, మేనిఫెస్టోను అమలు చేసి సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసే విధంగా మీ ఆలోచ నలు ఉండాలని రెడ్డి సామాజిక వర్గ సభ్యు ల మనోభావాలను దెబ్బతీసే విధంగా మీరు ప్రవర్తిస్తే మీ ప్రభుత్వాన్ని మిమ్మల్ని గద్దె దించేంత వరకు రెడ్డి కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ అనేది రాష్ట్రమం తటా కాలికి బలపం కట్టుకొని గడపగడ కు తిరుగుతుందని వారన్నారు.ఈ కార్యక్రమంలో జాతీయ కన్వీనర్ వెంగల్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జగన్ సంక్షేమ పథకాలకు బ్రాండ్ అంబాసిడర్ - ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి

### వైకాపా మండల సర్వసభ్య సమావేశం ప్రతిపక్షంలోనూ ప్రజల పక్షానే పోరాటం

ప్రజాభూమి ఒంటిమిట్ట:



రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలే ప్రజలకు జీవనాధారం అవుతున్నాయని, ఆ సంక్షేమ పథకాలకు జగన్ గారు బ్రాండ్ అంబాసిడర్ అని రాజంపేట ఎమ్మెల్యే ఎం. అమర్నాథ్ రెడ్డి తెలిపారు. ఒంటిమిట్ట హరిత కళ్యాణ మండపంలో శనివారం నాడు జరిగిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నెరవేర్చలేని వాగ్దానాలతో ప్రజలను మోసం చేసి చంద్రబాబు తిరిగి అధికారంలోకి వచ్చారని ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి మండిపడ్డారు. ప్రజలకిచ్చిన హామీలను తీరుస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు, ఇప్పుడు ఆ హామీలను మర్చిపోయి ప్రజలను మరోసారి మోసం చేస్తున్నారని విమర్శించారు. "ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ప్రజల సమస్యల కోసం బలంగా పోరాడతాం. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రతి ఇంటికి చేరువ చేయడం పార్టీ కార్యకర్తల బాధ్యత అని తెలిపారు. ప్రభుత్వం చేసే అన్యాయాలను, ప్రజలకు కలిగే ఇబ్బందులను, వాస్తవాలను నేరుగా ప్రజలకు తెలియజేయాలని కార్యకర్తలకు సూచించారు.వైకాపా పార్టీలో వర్గాలు లేవని, ఒకే ఒక్క వర్గం అది జగన్ వర్గమేనని స్పష్టంగా చెప్పారు. కార్యకర్తలు, నాయకులు అన్నీ తారతమ్యాలు మరిచి, పార్టీ బలోపేతానికి సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీని కార్యకర్తల సంస్థగా మారుస్తామని, ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.సమస్యల పరిష్కారం కోసం సహకారం మండలంలో ఉన్న వివిధ సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రయత్నిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.సమస్యల పరిష్కారానికి తనతో ఎప్పుడైనా సంప్రదించవచ్చని, తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని చెప్పారు. ప్రభుత్వ పథకాలను ప్రతి ఇంటికి తీసుకెళ్ళే విధంగా కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించడానికి మండల స్థాయిలో సమన్వయం చేసుకోవాలని పేర్కొన్నారు.

ప్రజల పక్షాన బలమైన పోరాటంసభలో మండల స్థాయిలో పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన కార్యకలాపాలపై చర్చించారు ఈ సమావేశంలో రాష్ట్ర వైకాపా కార్యదర్శి అనూష రెడ్డి, ఆకేపాటి వేణుగోపాల్ రెడ్డి, ఇరగం సుబ్బారెడ్డి, మేకపాటి నందకిషోర్ రెడ్డి, శివారెడ్డి, సిగే భాస్కర్ రెడ్డి, నారాయణరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, సుబ్బారెడ్డి, జంగాలపల్లి శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగులు సమయపాలన పాటించాలి: గురుకుల పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్సీ

ప్రజాభూమి, పులివెందుల



డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ ప్రతిభా గురుకుల పాఠశాల ఉద్యోగులు సమయపాలన పాటించాలి అని శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామ గోపాల్ రెడ్డి అన్నారు. శనివారం లింగాల మండలం ఇప్పట్ల గ్రామ సమీపంలో ఉన్న బిఆర్ అంబేద్కర్ ప్రతిభ గురుకుల పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా ఉపాధ్యాయుల హాజరు పుస్తకాన్ని పరిశీలించారు. రెగ్యులర్, ఒప్పంద ఉద్యోగులు సమయ పాలన పాటించాలని తెలిపారు.అలాగే విధులలో అల సత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశా రు. చదువు చెప్పాల్సిన ఉపాధ్యాయులే, స్కూల్ లో రాజకీయాలు చేస్తే సహించేది లేదని,అలాంటి వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చ రించారు. విద్యార్థినులను మన కన్న బిడ్డల్లా చూసుకుని వారికి ఎటువంటి సమస్యలు తలెత్త కుండా చూసే బాధ్యత గురుకుల పాఠశాల యాజ మాన్యంపై ఉందన్నారు.గురుకుల పాఠశాలలోని విద్యార్థినిలకు ఎటువంటి సమస్యలున్న భయప డకుండా తమకు తెలియజేయాలని వారికి సూచించారు.విద్యార్థినిల నుంచి ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.అలాగే వంటశాలను పరిశీలించి వండిన ఆహారాన్ని, కూరలను పరిశీలించి, విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలనీ.. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని ఆయన తెలిపారు.కుళ్లిపోయిన కూరగాయలు ఉండడంతో సిబ్బంది పై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాజా కూరగాయలను సప్లై చేయాలని ఇదే సమస్య పునరావత్తమైతే కఠిన చర్యలు తప్పవనిహెచ్చరించారు.పాఠశాలలో ఏజెన్సీ ద్వారా పనిచేస్తున్న వారికి పెండింగ్ లో వున్న జీతాలు చెల్లించే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బొజ్జ మైసూరా రెడ్డి, తాళ్ళపల్లి వేంకటేశ్వర రెడ్డి, జ్ఞానేశ్వర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొడదాం...పర్యావరణాన్ని రక్షించుకుందాం

### ప్లాస్టిక్ తో భూమి, నీరు,వాతావరణం కలుషితం

### ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే 5000 రూపాయల జరిమానా

ప్రజాభూమి, పులివెందుల





ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టి, పర్యావరణాన్ని రక్షించుకుందాం అని మున్సిపల్ చైర్మన్ డా. వల్లెపు వరప్రసాద్, పులివెందుల స్పెషల్ అధికారి రాజ్య లక్ష్మి, ఆర్డీవో చిన్నయ్య లు అన్నారు శనివారం స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమములో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్లాస్టిక్ కాలుష్య నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ ను అరికట్టేందుకు మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక పూలంగల్ల సర్కిల్ నుండి పాత బస్టాండ్ వరకు ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పులివెందుల స్పెషల్ అధికారి రాజ్యలక్ష్మి ఆర్డీవో చిన్నయ్యలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కాసేపు చీపురు చేత పట్టి ప్రధాన రహదారులను శుభ్రం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పర్యావరణాన్ని రక్షించుకోవాలి అంటే ప్లాస్టిక్ కవర్లునిషేధించాలన్నారు.పర్యావరణ పరిరక్షణ చట్టాల ప్రకారం, 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ కవర్లను అమ్మడం నిషేధించబడిందన్నారు. ఇలాంటి కవర్లను విక్రయించే వారిపై జరిమానా విధించడంతోపాటు, చట్టపరమైన చర్యలు కూడా తీసుకోవడం జరుగు తుందన్నారు. ప్లాస్టిక్ ను వినియోగించడం వల్ల భూమి, నీరు, వాతావరణం కలుషితం అయిపోతా యని తెలిపారు. ప్రతి విద్యార్థి తమ తల్లిదండ్రు లకు, కుటుంబ సభ్యులకు ప్లాస్టిక్ వాడటం వల్ల కలిగే నష్టాల గురించి,నిషేధం గురించి చెప్పాలని వారు కోరారు. అలాగే పట్టణంలో దుకాణదారులు, హొటళ్ల యజమానులు ప్లాస్టిక్ కవర్లు విక్రయించి నా , వాడిన మొదటి తప్పుగా రూ 5000 రూపా యలు జరిమానా విధించడం జరుగుతుందన్నా రు.సచివాలయ శానిటరీ సెక్రటరీలు కూడా తమ పరిధిలో ఉన్న దుకాణాలలో ప్లాస్టిక్ కవర్లను విక్రయించకుండా చూడాల్సిన బాధ్యత ఉందన్నా రు. బాధ్యతలు మరిచి, విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన శానిటరీ సెక్రటరీలపై కూడా జరిమానా విధించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాముడు, వైస్ చైర్మన్ హాఫీజ్,కౌన్సిలర్లు కిషోర్, ఖాదర్, పురుషోత్తం, భార్గవి, శాంతమ్మ వైకాపా నాయకులు మస్తాన్ వల్లి,రవి, డ్వాక్రా యానిమేటర్లు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛతకు ప్రతి ఒక్కరు సహకరించాలి

ప్రజాభూమి పోరుమామిళ్ల:



పంచాయతీ స్వచ్ఛతకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని పోరుమామిళ్ల మేజర్ పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్ నాయుడు, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆర్ సి ఓబులేష్ పేర్కొన్నారు. శనివారం పంచాయతీలోని ట్రేడ్ లైసెన్స్ దారులకు స్వచ్ఛత విషయమై నోటీసులు జారీ చేశారు. ప్రతి ఒక్కరు తమ దుకాణాల పరిధిలో వచ్చే చెత్త అట్టపెట్టెలు ఇతర వ్యర్థాలను పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు అందించాలని వారు సూచించారు. పంచాయతీ పరిధిలోని వ్యాపారులందరూ ట్రేడ్ లైసెన్స్ ఫీజులను చెల్లించి తమ లైసెన్సులను రెన్యువల్ చేయించుకోవాలని కోరారు. రెన్యువల్ చేయించుకొని వారిపై పంచాయతీరాజ్ చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. వరికుంట్ల బస్టాండ్ నుంచి మసీదు వరకు ఉన్న దుకాణదారులకు పంచాయతీరాజ్ సిబ్బందితో కలిసి వారి నోటీసులు అందజేసి పారిశుద్ధ్య విషయమై తగు జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రాధాకృష్ణ, వెంకట రామిరెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. అంతకుమునుపు స్వచ్ఛందర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పోరుమామిళ్ల పంచాయతీలోని నాలుగు సచివాలయాల ప్రతి సిబ్బంది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించి స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు.

# గజరాజుల దాడులతో రైతులకు తీవ్ర నష్టం..!

## - కందకాలు తవ్వి,సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటుచేయండి
## - సీఎం చంద్రబాబు కి దేవర మనోహర్ వినతి..

ప్రజా భూమి, చంద్రగిరి:



చంద్రగిరి నియోజకవర్గం, అటవీ సమీప ప్రాంతాల గ్రామాలపై గజరాజుల బెడద పెరిగిపోతోంది. ఎర్రవరిపాలెం, చిన్నగొట్టిగల్లు, పాకాల, చంద్రగిరి మండలాల్లో అడవి ఏనుగులు తరచూ రావడం వల్ల ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. రైతుల పంటలు నాశనం కావడం, ఇంటి వద్దకే ఏనుగులు రావడం గ్రామస్తులను ఆందోళనకు గురి చేస్తోంది. ఈ నేపథ్యంలో బాధిత గ్రామస్తుల తరపున శనివారం చంద్రగిరి నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జ్ దేవర మనోహర్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిసి వినతిపత్రం అందజేశారు. "సమీప అడవుల నుంచి ఏనుగులు తరచూ గ్రామాల్లోకి వస్తున్నాయి. పంటలు ధ్వంసమవుతున్నాయి. రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రాణాలకు ప్రమాదం తలెత్తుతోంది. శాశ్వత పరిష్కారంగా సౌర కంచెలను ఏర్పాటు చేయాలని విన్నవించారు. గ్రామాల వద్ద సరిహద్దుల్లో సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం, కందకాలు తవ్వడం ద్వారా గజరాజుల ప్రవేశాన్ని అడ్డుకోవచ్చని దేవర మనోహర్ తెలిపారు. ఏనుగుల కదలికలపై పహరా, హెచ్చరికల బోర్డులు, అలారంలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇప్పటికే కొంతమంది రైతులు వరుసగా రెండు సీజన్లు పంట నష్టాలను మూటగట్టుకోవాల్సి వచ్చిందని తెలిపారు. సానుకూలంగా స్పందించిన సిఎం సమస్య పరిష్కారానికి కృషి చేస్తారని హామీ ఇచ్చారు.

### బీసీ బాలికలకు హాస్టల్ వసతి కల్పించాలి : బిజెపిఇంచార్జ్ పి వి.కృష్ణారావు

ప్రజాభూమి మార్కాపురం



మార్కాపురం పట్టణంలోని పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి విచ్చేసిన రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామికి భారతీయ జనతా పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ పివి కృష్ణారావు బీసీ బాలికలకు హాస్టల్ వసతి లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని దయచేసి బాలికలకు హాస్టల్ వసతిని ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సతీషు రమేష్ మునెయ్య రాజు తదితరులు ఉన్నారు.

## ఏపీఎస్ఆర్టీసీ బస్టాండ్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

ప్రజాభూమి మార్కాపురం



మార్కాపురం బస్టాండ్ ఆవరణలో ప్రజలకు అందుబాటులో ఉన్న మరుగుదొడ్లు, మరియుబస్టాండులో ఉన్న ఒక షాపులో స్థానికంగా తయారైన తాగునీటి బాటిళ్ళు అధిక రేటు కు విక్రయించడం మే కాకుండాఎలాంటి ఎం.ఆర్.పీ రేటు. లేకుండా ఇష్టానుసారంగా అమ్ముతున్న తినుబండారాల ప్యాకెట్లను .షాపులో ధరల పట్టీక కూడా లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన జిల్లా కలెక్టర్ అమిత్ అన్సారిఈ షాపును వెంటనే క్లోజ్ చేయించాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్

## ప్లాస్టిక్ భూతాన్ని తరిమి వేయాలి

ప్రజాభూమి, హిందూపురం టౌన్




ప్లాస్టిక్ ని శాశ్వతంగా రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. ప్రగతి పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రతిష్టాత్మక " స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర " కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. కళాశాల ఎన్ఎస్ఎస్, ఎన్ సి సి విభాగాలు సంయుక్తంగా చేపట్టిన ఈ కార్యక్రమం, ప్రతినెల మూడవ శనివారం, క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామన్నారు. కళాశాల ఆవరణం బయట ప్రదేశంలో రోడ్డుకిరువైపులా పడివున్న ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించిన ఎన్ఎస్ఎస్, ఎన్ సి సి వాలంటీర్లను ప్రిన్సిపాల్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశులు, ఐక్యూఎసి కోఆర్డినేటర్ శ్రీలక్ష్మి, అధ్యాపకులు ఎల్ఆర్ రమేష్, భోజప్ప, ప్రకాష్రావు, ఎన్ సి సి అధికారి సరస్వతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రంగనాయకులు, సీనియర్ అసిస్టెంట్ నరసింహులు పాల్గొన్నారు.

## క్రిస్టియన్, మైనార్టీలు సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోండి..!

ప్రజాభూమి,గుంతకల్లు ప్రతినిధి:

క్రిస్టియన్, మైనార్టీలకు సబ్సిడీ కునాల కోసం దరఖాస్తు చేసుకోవాలని గుంతకల్లు మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ శనివారం ఒక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం క్రిస్టియన్, మైనార్టీ నిరుద్యోగ యువతీ యువకులకు సబ్సిడీ రుణాలను మంజూరు చేసేందుకు నిర్ణయించిందన్నారు. ఈ మేరకు 'ఏపీఓబిఎంఎంఎస్. ఏపీసిఎఫ్ఎస్ఎస్. ఐఎన్' వెబ్ సైట్ లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. దరఖాస్తుదారుడు మైనార్టీ సమాజానికి (ముస్లిం, క్రైస్తవులు, సిక్కు, జైనులు, పార్సీలు)చెందిన వారి ఉండాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారై ఉండాలన్నారు. దరఖాస్తుదారుడి వయస్సు 21 నుండి 55 సంవత్సరాలు లోబడి ఉండాలన్నారు. మైనార్టీ సంక్షేమ శాఖల ద్వారా అమలయ్యే అన్ని పథకాలకు సంబంధించి తల్లిదండ్రులు/దరఖాస్తుదారుల వార్షిక ఆదాయం పట్టణ ప్రాంతాల్లో రూ.1, 50,000, గ్రామీణ ప్రాంతాల్లో రూ.2, 00,000 ఉండాలన్నారు. ప్రతి కుటుంబానికి ఒక ఆర్థిక సహాయ పథకం మాత్రమే (రేషన్ కార్డులో పొందుపరిచిన విధంగా) మంజూరు చేయబడుతుందన్నారు. జిల్లా, మండల స్థాయిలో మొత్తం లక్ష్యంలో కనీసం 33 శాతం కవర్ చేయడానికి మహిళా లబ్ధిదారులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందన్నారు. దరఖాస్తుదారులు రవాణా రంగ స్వయం ఉపాధి పథకాలకు సంబంధించి డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలన్నారు. దరఖాస్తుదారులు జనరిక్ ఫార్మసీల పథకాలకు డి.ఫార్మసీ/బి. ఫార్మసీ/. ఫార్మసీ కలిగి ఉండాలన్నారు.

## స్వచ్ఛ్ ఆంధ్ర బ్యానర్ పై కనపడని ప్రధాని మోదీ బొమ్మ

### బిజెపి మండల కన్వీనర్ నరసింహమూర్తి

ప్రజాభూమి, లేపాక్షి:



మండల కేంద్రమైన లేపాక్షిలో ఎంపీడీవో నరసింహమూర్తి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛభారత్ కార్యక్రమంలో ప్రదర్శించిన బ్యానర్లో భారత ప్రధాని మోడీ బొమ్మ లేకపోవడం బాధాకరమని లేపాక్షి బిజెపి మండల కన్వీనర్ నరసింహమూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. స్వచ్ఛభారత్ కార్యక్రమ పితామహుడైన ప్రధాని మోదీని లేపాక్షి అధికారులు మరచాలని పేర్కొన్నారు. ఈ విషయంపై ఎంపీడీవోని చర్చించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. దీంతో సోమవారం మండల కేంద్రంలో అధికారుల వైఖరికి నిరసనగా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాన్ని చేపడతామని బిజెపి కన్వీనర్ నరసింహమూర్తి పేర్కొన్నారు.

# వైసీపీ వెన్నుపోటుకు.. ప్రజల ఓటు పోటు : బీజేపీ నేత డాక్టర్ ఏలూరి.

### గత ఐదేళ్లలో ఏమి చేశారని ప్రజల్లోకి వెళతారు : వైసీపీకి డాక్టర్ ఏలూరి ప్రశ్న నో

ప్రజభూమి మార్కాపురం



మార్కాపురం వైఎస్ఆర్సీపై బీజేపీ నేత డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి ఫైర్ అయ్యారు. గత వారం రోజులుగా ప్రకాశం జిల్లాలో బాబు షూరిటీ మోసం గ్యారెంటీ అంటూ అసత్యాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.. ఏడాది తిరగకుండానే ఎన్నో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించే ముందు గత ఐదేళ్లలో జిల్లాకు వైసీపీ చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలన్నారు.. జిల్లాలో అతి ముఖ్యమైన వెలిగొండ ప్రాజెక్టును పూర్తి కాకుండానే జాతికి అంకితం చేసి రైతులను మోసం చేశారని అన్నారు.. అలాగే దొనకొండలో కేంద్రప్రభుత్వం పారిశ్రామిక కారిడార్ ను సూచిస్తే దానిపై గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు.. అలాగే రామాయపట్నం పోర్టు నిర్మాణం పనులు అసంపూర్తిగా చేశారని దుయ్యబట్టారు.. మార్కాపురంలో మెడికల్ కాలేజీని ఏర్పాటు చేస్తామని పునాదులు తవ్వి అలాగే వదిలేశారని.. పైగా కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీ నిర్మాణం చేపట్టలేదని ఆరోపించడం వారి మోసపూరిత ధోరణికి నిదర్శనం అన్నారు. జిల్లా అంతటా వందల కిలోమీటర్ల మేర రోడ్లు పాడవుతే కనీసం 10 కిలోమీటర్లు కూడా రోడ్లు నిర్మించిన పాపాన పోలేదన్నారు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతే రోడ్లు సర్వాంగ సుందరంగా మారుతున్నాయని చెప్పారు. జిల్లాల పునర్విభజనలో పశ్చిమ ప్రకాశం జిల్లాకు తీవ్ర అన్యాయం చేశారని ఆరోపించిన ఏలూరి.. ఈ ప్రాంత ప్రజల మనోభావాలను కనీసం పరిగణలోకి తీసుకోలేదన్నారు.. జిల్లాకు ఇంతలా వెన్నుపోటు పొడిచిన వైసీపీ నేడు ఏ మొహం పెట్టుకొని ప్రజల్లోకి వెళుతుందో చెప్పాలన్నారు.. వెలిగొండ ప్రాజెక్టు యొక్క స్వరూప స్వభావం తెలియని వారు కూడా ఈ ప్రాజెక్టుని సందర్శించి నోటికి వచ్చినట్టు మాట్లాడుతున్నారని.. అలాంటి వారు గత ప్రభుత్వం చేసిన అన్యాయం గురించి కూడా ప్రజలకు వివరిస్తే బాగుంటుందని సూచించారు.. ఈ ప్రాజెక్టు కింద నిర్వాసితులకు ఇవ్వాల్సిన ఆర్ అండ్ ప్యాకేజి ఇవ్వకుండా ఇప్పుడు కూటమి ప్రభుత్వాన్ని ఇవ్వాలని డిమాండ్ చేసే నైతిక హక్కు వారికి లేదని వ్యాఖ్యానించారు.. కూటమి ప్రభుత్వం త్వరలోనే వెలిగొండను పూర్తి చేసి జాతికి అంకితం చేస్తుందన్నారు.. అలాగే జిల్లాలో పెద్దఎత్తున పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తామన్నారు.. జిల్లా ఏర్పాటు కూడా చేస్తుందని డాక్టర్ ఏలూరి ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా ఏర్పాటు అయితే కేంద్రీయ విద్యాసంస్థలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు.. చివరిగా.. జిల్లాకు మీరు వెన్నుపోటు పొడిచారు కాబట్టే ప్రజలు మీకు ఓటు పోటు పొడిచారని చమత్కరించారు డాక్టర్ రామచంద్రారెడ్డి.

## ప్లాస్టిక్ నిర్మూలన మనందరి బాధ్యత

ప్రజాభూమి, లేపాక్షి:



ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలనతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని ఎంపీడీవో నరసింహమూర్తి, మండల విద్యాధికారి నాగరాజు, ఈ ఓ ఆర్ డి నాగరాజు లు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రమైన లేపాక్షిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రిన్సిపల్ మహబూబ్ బాషా ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల నుండి నంది విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వినియోగానికి వ్యతిరేకంగా విద్యార్థులు నినాదాలు చేశారు. అనంతరం లేపాక్షి బస్టాండ్ లో మానవహారం ఏర్పాటు చేశారు. ఎంపీడీవో నరసింహామూర్తి, ఎంఈఓ నాగరాజులు మాట్లాడుతూ, ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి పెనుముప్పు కలుగుతుందన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిలో కలవక దుర్వాసన వెదజల్లుతూ భూమిని, పర్యావరణాన్ని దెబ్బతీస్తోందన్నారు. ప్రధానంగా మార్కెట్లలోనూ, దుకాణాలలోనూ ప్రతి చిన్న వస్తువుకు ప్లాస్టిక్ కవర్ జతపరచి ఇస్తుండడం బాధాకరమైన విషయం అన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ప్లాస్టిక్ వినియోగాన్ని రూపుమాపాల్సిన బాధ్యత మన పైనే ఉందన్నారు. పర్యావరణ పర్యటన కోసం ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి సంరక్షించాలన్నారు. పచ్చదనం అంతరిస్తోందే గాని పచ్చదనం పెంపొందించాలన్న పట్టుదల ఎవరిలోనూ లేదన్నారు. పచ్చదనం పెంపొందించడంతోనే సకాలంలో వర్షాలు పడడంతో పాటు, పర్యావరణ పరిరక్షణ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

# తుమ్మలగుంట గ్రామ పంచాయతీలో "స్వచ్ఛ ఆంధ్ర" స్వచ్ఛభారత్ కార్యక్రమము..

ప్రజాభూమి, చంద్రగిరి:



తిరుపతి రూరల్ మండలము, తుమ్మలగుంట పంచాయతీలోశనివారంస్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛభారత్ కార్యక్రమంనిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో, స్వచ్ఛ భారత్ మిషన్ లక్ష్యాలను సాధించడానికి, చురుకుగా పనిచేస్తోందని, తుమ్మలగుంట తెలుగుదేశం పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగం ఆర్గనైజింగ్ సెక్రటరీ బిరుదాల భాస్కర్ రెడ్డితెలిపారు. ఈ కార్యక్రమంలోపంచాయతీ అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలతో కలసి స్వేచ్ఛ స్వేచ్ఛతా హి సేవ కార్యక్రమంనిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఆధ్వర్యంలో పంచాయతీ మరింత అభివృద్ధి చెందుతుందని, తద్వార మరుగుదొడ్ల నిర్మాణం,ఆరోగ్యం, ద్రవ వ్యర్థాల నిర్వహణ పరిశుభ్రత, పారిశుధ్యాన్ని ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. ఈ క్రమంలో గ్రామ ప్రజలు, పంచాయతీ సిబ్బంది, కూటమి నాయకులతో ప్రతిజ్ఞ చేయించారు, తర్వాత వీధులను శుభ్రం చేసి, గ్రామ ప్రజలకు ఇలాంటి కార్యక్రమాల ద్వారా గ్రామాలు, రాష్ట్రం గణనీయమైన పురోగతిని సాధిస్తుందని, ఆశాభావం వ్యక్తం చేస్తున్నానని అన్నారు. స్వచ్ఛ స్వచ్ఛతా హి సేవ 2025 ప్రచారంలో పాల్గొనడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌నుపరిశుభ్రమైన,ఆరోగ్యకరమైన రాష్ట్రంగా మార్చడానికి దోహద పడవచ్చనని, చివరికి స్వచ్ఛమైన స్వర్ణ ఆంధ్రప్రదేశ్ అనే దార్శనికతను సాధించవచ్చు అని బిరుదాల భాస్కర్ రెడ్డి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూర దృష్టి కలిగిన వ్యక్తి అని ఆయన గతంలోనూ జన్మభూమి కార్యక్రమం నిర్వహించి పరిశుభ్రతపై విద్యార్థి దశ నుంచి ప్రతి ఒక్కరిలో శుభ్రత గురించి అవగాహన కల్పించిన వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పి. వెంకటేశ్వర్లు, సర్పంచ్ సుబ్బరామిరెడ్డి, ఎంపిటిసి బుజ్జమ్మ,టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు పార్లపల్లి భరత్ కుమార్ రెడ్డి, యోగానంద రెడ్డి, ఓ. కేశవులు శెట్టి,బి.తులసి రామి రెడ్డి,బి.సిద్దా రెడ్డి, జి .సుబ్రహ్మణ్యం,పద్మమ్మ,రాధిక, మాజీ సర్పంచ్ సి.జయచంద్రరెడ్డి, ఎస్ వెంకటేష్ నాయుడు,టి. లక్ష్మీనారాయణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో మంత్రి డోరా వీరాంజనేయ స్వామి

ప్రజభూమి మార్కాపురం




మార్కాపురం పట్టణంలోని మున్సిపాలిటీ మరియు గడియార స్తంభం సెంటర్లో జరిగిన "స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర" కార్యక్రమంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మాత్యులు శ్రీ డోల బాల వీరాంజనేయ స్వామి , గౌరవ ప్రకాశం జిల్లా కలెక్టర్ శ్రీమతి తమిమ్ అన్సారీయా మరియు స్థానిక మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మార్కాపురం మున్సిపాలిటీలో పనిచేస్తున్న శానిటరీ సిబ్బందికి సన్మానం చేశారు. అనంతరం గడియార స్తంభం వద్ద విద్యార్థులతో మానవహారం ఏర్పాటు చేశారు. వక్తలు మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలకు ప్రజలు దూరంగా ఉండాలని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలనిపిలుపునిచ్చారు.అనంతరం మార్కాపురం సర్వజన వైద్యశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ఐ సి యు ను మరియు థైరాయిడ్ మిషన్ ను మంత్రివర్యులు, జిల్లా కలెక్టర్ గారు, శాసనసభ్యుల వారు ప్రారంభించి డాక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు మాట్లాడుతూ సొంత నిధులతో ఐసీయూను స్థానిక శాసనసభ్యుల వారు ఏర్పాటు చేయటం హర్షనీయమని అన్నారుఅనంతరం తరలిపాడు మండలంలోని మండల కేంద్రమైన తర్లపాడు లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నూతనంగా ఏర్పాటుచేసిన ల్యాబ్ ను మంత్రివర్యులు శ్రీ డోల బాల వీరాంజనేయ స్వామి శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి ప్రారంభించారు.తర్లపాడు గ్రామంలోని ఎస్సీ పాలెం లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని వారు ఇరువురు అందరికీ పాంప్లెట్లు పంచి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ వివరించారు.అనంతరం తొర్రపాడు మండలంలోని సీతా నాగులవరం గ్రామంలో నూతనంగా 25 లక్షలతో అంతర్గత సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అదే గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు.తదనంతరం మార్కాపురం మండలంలోని బోడపాడు గ్రామంలో నూతనంగా 25 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారుఈ కార్యక్రమాలలో ఆయా మండలాల గ్రామాల తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

# టిడిపి తోనే అన్ని వర్గాల సంక్షేమం

### టిడిపి కో ఆర్డినేటర్ పావులూరి శ్రీనివాసరావు, టిడిపి నాయకులు

ప్రజాభూమి, హిందూపురం టౌన్



తెలుగుదేశం పార్టీతోనే అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి సాధ్యమవుతుందని టిడిపి కో ఆర్డినేటర్ పావులూరి శ్రీనివాసరావు, టిడిపి నాయకులు పేర్కొన్నారు. శనివారం తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని పార్టీ మండల అధ్యక్షులు హెచ్ఎన్ రాము ఆధ్వర్యంలో రూరల్ మండలం సంతేబిదనూరు పంచాయతీలో నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటింటికి వెళ్ళి ఏడాది పరిపాలనలో కూటమి ప్రభుత్వం అందించిన పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షులు రాము మాట్లాడుతూ, గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ లను అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ అశ్వర్థ నారాయణ రెడ్డి, అరుణాచలరెడ్డి, మాజీ జడ్పీటీసీ ఆదినారాయణ, ఐటీడీపి రామాంజి, శ్రీరాములు, ప్రదీప్, సర్పంచులు చెక్కిరప్ప, మంజు, హనుమంతు, టిజి నాగరాజు, ఉమాశంకర్ రెడ్డి, ఎంపీటీసీ శివ, మాజీ ఎంపీటీసీలు అంజి, ప్రకాష్, రామాంజి, శంకర్, మదన్ గోపాల్ రెడ్డి, అంజన రెడ్డి, రషీద్, వెంకటరమణప్ప, బాబు, అది నారాయణప్ప, నగేష్, భరత్ స్వామి, మల్లప్ప, శివప్ప, మూర్తి, వేణు, నంజుండప్ప, గ్రామ కమిటీ అధ్యక్షులు అమర్ నారాయణ, పాపన్న, నారాయణప్ప, రామకృష్ణ, అశ్వర్థ, గోపాల్ రెడ్డి, అంజన్ రెడ్డి, బాబు రెడ్డి, రామగిరి సూరి తదితరులు పాల్గొన్నారు.

Printed by MOHANEESWAR PUBLICATIONS Published by ANKIREDDYPALLE RAMAMOHAN REDDY on behalf of ANKIREDDYPALLE RAMAMOHAN REDDY , printed at West Godavari and published at D. No.11-12-124, Nawabpetcolony,3rd Division, Eluru editor ANKIREDDYPALLE RAMAMOHAN REDDY RNI NO:APTEL/25/A1219 Phone No. Cell : 9502116677